www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల : 5.00
Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 55 | గురువారం | 8 ఆగస్టు 2024



వినేశ్.. నువ్వే మా ఛాంపియన్!

8 లో..

# వినేశ్ ఫొగట్‌పై అనర్హత

- నువ్వెప్పుడూ ఛాంపియన్‌వే
- ఓదారుస్తూ ప్రధాని మోడీ ప్రకటన
- పీటీ ఉషతో కారణాలపై ఆరా



**పారిస్/న్యూఢిల్లీ:**

పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ ఫైనల్‌కు చేరిన వినేశ్ ఫొగాట్ పతకం సాధిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్న భారత అభిమానులకు షాక్ తగిలింది. 50 కేజీల విభాగంలో ఇవాళ రాత్రి ఫైనల్‌లో వినేశ్ తలపడాల్సి ఉంది. ఈ క్రమంలో ఆమె బరువును చూసిన నిర్వాహకు లు 100 గ్రాములు అదనంగా ఉ న్నట్లు గుర్తిం చారు. దీంతో వినేశ్‌పై అనర్హత వేటు వేస్తూ ఒలింపిక్ కమిటీ, రెజ్లింగ్ కమిటీ నిర్ణయం తీసుకున్నాయి. ఫైనల్ పోరులో పసిడి పతకం సాధిస్తుందన్న ఆశల వేళ ఈ వార్త కోట్లా ది మంది భారతీయుల హృదయాలను ముక్క లు చేసింది. ఈ క్రమంలోనే అనర్హతపై ప్రధా ని మోదీ స్పందిస్తూ వినేశ్‌ను ఓదార్చారు. వినేశ్.. నువ్వు ఛాంపియన్లకే ఛాంపియన్! నీ ప్రతిభ దేశానికి గర్వకారణం. భారతీయులందరికీ నువ్వు స్ఫూర్తిదాయకం. ఈ రోజు నీకు తగిలిన ఎదురుదెబ్బ ఎంతో బాధించింది. దీన్ని వ్యక్తం చేయడానికి నా దగ్గర మాటల్లేవు. కానీ,ఈ బాధ నుంచి బయటపడి నువ్వు బ లంగా తిరిగి రాగలవని నేను నమ్ముతున్నా. సవాళ్లను ఎదిరించడం నీ నైజం. నీకు మేమంతా అండగా ఉన్నాం అని మోదీ భరోసా నిచ్చారు.

## బీజేపీలో బీఆర్ఎస్ విలీనం
# దుష్ప్రచారం

వార్తల ప్రచారంపై కేటీఆర్ ఆగ్రహం

న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:**

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం లేదు.. అలా తప్పుడు వార్తలు ప్రసారం చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ పైన, విలీనం లాంటి ఎజెండా పూరిత దుష్ప్రచారం చేస్తున్న విరీడియా సంస్థలు, వ్యక్తులు వెంటనే ప్రజలకి వివరణ ఇవ్వాలి. లేదంటే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని కేటీఆర్ హెచ్చరించారు. 24 సంవత్సరాలుగా ఇలాంటి అనేక కుట్రలు, కుతంత్రాలు, కుట్రదారులను ఎదుర్కొన్న పార్టీ మాది. ఇవన్నీ దాటుకొని 24 ఏండ్ల పాటు నిబద్ధతతో, పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణ సాధించిన పార్టీ బీఆర్ఎస్. సాధించుకున్న తెలంగాణ సగర్వంగా నిలబెట్టుకొని, అభివృద్ధిలో అగ్రపథాన నిలిపాము అని కేటీఆర్ తెలిపారు. ఆత్మగౌరవం, అభివృద్ధిని పర్యాయపదాలుగా మార్చుకొని ఇతర రాష్ట్రాలకి ఆదర్శంగా ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాము. కోట్లాది గొంతుకలు, హృదయాలు తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ గుర్తింపు కోసం పోరాడుతున్నాయి కాబట్టే ఇది సాధ్యమైంది. ఎప్పటిలానే బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల కోసం నిలబడుతుంది.. పోరాడుతుంది. ఇప్పటికైనా అడ్డగోలు అసత్యాలను, దుష్ప్రచారాలను మానుకోవాలి. పడతాం, లేస్తం, తెలంగాణ కోసమే పోరాడుతాం? కానీ తలవంచం.. ఎన్నటికైనా ఎప్పటికైనా అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

మిగతా 2 లో



## ప్రతి రూపాయినీ జాగ్రత్తగా
# ఖర్చు పెడుతున్నం

**త్వరలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభిస్తాం**

- ఆర్థిక ఇబ్బందులున్నా హామీలు అమలు చేస్తున్నం
- హామీ ఇచ్చినట్టే ధరణి బంగాళాఖాతంలో వేశాం
- నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం
- పాదయాత్రలో ప్రజల గుండె చప్పుడు విన్నా
- మీ ఆశీర్వాదంతోనే డిప్యూటీ సీఎం అయ్యా
- ఆదిలాబాద్‌ను గుండెల్లో పెట్టి చూసుకుంటా
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**ఆదిలాబాద్, ప్రజానావ:**

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో రూ.20.50 కోట్లతో పలు అభివృద్ధి పనులకు భట్టి విక్రమార్క భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు తాను ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో ప్రారంభించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చరిత్రాత్మకమని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో పిప్రిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం భట్టి శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇక్కడి ప్రజల ఆశీర్వాదంతోనే తాను 32 రోజుల పాటు పాదయాత్ర చేశానని, ప్రజల గుండె చప్పుడు విన్నానని అన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యలు తెలుసుకునేందుక గతంలో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేశాను. గత ఏడాది మార్చి 16న పిప్పిరి నుంచే పీపుల్స్ మార్చ్ ప్రారంభించాను. ఈ ఏడాది మార్చి 16న ఇక్కడే సభ పెట్టాలనుకున్నాం.. కానీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. ఇవాళ జరిగే సభకు చాలా ప్రత్యేకత ఉంది. ఇక్కడి ప్రజల ఆశీర్వాదం వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిరది. నియోజకవర్గంలో 3,500 ఇళ్లకు తగ్గకుండా ఏడాదిలో 4.50లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం. ఆరోగ్యశ్రీ కింద ఇచ్చే మొత్తాన్ని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాం అని భట్టి విక్రమార్క అన్నారు. విరీ ఆశీర్వాదంతోనే డిప్యూటీ సీఎంను అయ్యానని భట్టి చెప్పారు. పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ గుర్తున్నాయని, వాటిని ఒక్కొక్కటిగా కచ్చితంగా అమలు చేస్తామని చెప్పారు. అప్పుడు చెప్పినట్టుగానే ధరణిని బంగాళాఖాతంలో వేశామని

మిగతా 2 లో

## అసమగ్రంగా జీవో 33

- లోకల్ తెలంగాణ విద్యార్థులకు తీరని నష్టం
- అడ్డదిడ్డంగా సర్కార్ నిర్ణయాలతో ఆందోళన
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు


2 లో..



## నిండుకుండలా సాగర్ జలాశయం

22 గేట్లు ఎత్తి కొనసాగుతున్న నీటి విడుదల

3 లో..



## ఎస్సారెస్పీలోకి ఇన్ ఫ్లో

2 లో..



## కొత్త సిటీ లక్ష్యంగా
# సీఎం రేవంత్ ప్రచారం

- స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేసిన ప్రాంతంలోనే నిర్మాణం
- అమెరికా పర్యటనలో దీనిపైనా సిఎం ప్రస్తావన

3 లో..



## భద్రాచలంలో రెండ్రోజులుగా భారీ వర్షం

నీట మునిగిన రామాలయం ప్రాంతం

అధికారుల తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల

3 లో..





## ప్రతి రూపాయినీ జాగ్రత్తగా ఖర్చు పెడుతున్నం

(మొదటిపేజీ తరువాయి)
తెలిపారు. ధరణిపై కేబినెట్ సబ్ కమిటీ వేశామని, దానిని సమూలంగా ప్రక్షాళన చేస్తామని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వెనుకబడిన ప్రాంతం కాదని అన్నారు. ఈ జిల్లాను తాను గుండెల్లో పెట్టి చూసుకుంటానని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి రూపాయి ని జాగ్రత్తగా ఖర్చు పెడుతున్నామని,ఆరు గ్యారెంటీల్లో అతి ముఖ్యమైన రుణమాఫీని అమలు చేశామని అన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని చెప్పారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని, 8 నెలల్లో 30 వేల కొలువులు భర్తీ చేశామని, అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్ ను కూడా విడుదల చేశామని వివరించారు. ఆడ బిడ్డలకిచ్చిన మాటకోసం మహిళా తల్లులకు మొదటి రోజునే ఫ్రీ బస్ స్కీం ను ప్రారంభించామని చెప్పారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని భట్టి చెప్పారు. ఇందు కోసం ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు ఇవ్వనున్నట్టు ఆయన వివరించారు. తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు ను నిర్మించి తీరుతామని అన్నారు రూ.45కోట్లు వెచ్చించి పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను ప్రారంభిస్తామని వివరిం చారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పలువురు పాల్గొన్నారు.

# అసమగ్రంగా జీవో 33

- లోకల్ తెలంగాణ విద్యార్థులకు తీరని నష్టం
- అడ్డదిడ్డంగా సర్కార్ నిర్ణయాలతో ఆందోళన
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల మన తెలంగాణ బిడ్డ.. మనకు నాన్ లోకల్ అవుతున్నాడని రేవంత్ రెడ్డి సర్కార్‌పై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. మెడికల్ అడ్మిషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 33 సమగ్రంగా లేదని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు విలేకరులతో మాట్లాడారు. మన తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం గుడ్డెద్దు చెనులో పడ్డట్టు ఉంది. రాష్ట్ర భవిష్యత్‌ను, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సమగ్ర ఆలోచన లేకుండా అడ్డదిడ్డంగా వ్యవహరిస్తుంది. నిన్న మెడికల్ ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియకు నోటిఫికేషన్ వచ్చింది. మన తెలంగాణ విద్యార్థులకు, భవిష్యత్ తరాలకు తీరని నష్టం చేసే విధంగా ఆ నోటిఫికేషన్‌లో నిబంధనలు ఉన్నాయి. అంటే మన పిల్లలే మనకు స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉంది. కనీసం అధ్యయనం లేకుండా ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త నిబంధనలు విద్యార్థుల ప్రయోజనాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాలు అనే అంశాల వీరీద జరిగింది. నియామకాలకు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం మన ఆకాంక్షలను నిజం చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ నియామకాల్లో 60 శాతం లోకల్, 40 శాతం నాన్ లోకల్ రిజర్వేషన్లు ఉండే. 70 శాతం లోకల్, 30 శాతం నాన్‌లోకల్‌గా కూడా నింపేవారు. కానీ కేసీఆర్ శ్రద్ధ పెట్టి ఉద్యోగ నియామకాల విషయంలో రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ చేసి 95 శాతం లోకల్‌కు, 5 శాతం ఓపెన్ కోటాగా నిర్ణయించారు. జీవో నంబర్ 124.. 2018లో విడుదల చేశాం. దీని వల్ల రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల్లో 95 శాతం ఉద్యోగాలు స్థానికులకు దక్కేలా రిజర్వేషన్లు సాధించాం. గతంలో 40 శాతం మంది పక్క రాష్ట్రం నుంచి వచ్చి ఓపెన్ కోటాలో ఉద్యోగాలు పొందేవారు. కానీ కేసీఆర్ రాష్ట్రపతి, ప్రధానిని కలిసి 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకు దక్కేలా సవరణలు చేశారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. విద్యాలయాల్లో ప్రవేశాల విషయంలో కూడా మనం సవరణలు చేసుకోవాల్సి ఉండే. కానీ స్టేట్ రీఆర్గనైజేషన్ యాక్ట్‌లో పదేండ్ల పాటు పాత పద్ధతి యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. అంటే 15 శాతం ఓపెన్ కోటా ఉందో.. ఆంధ్రాలో తెలంగాణ విద్యార్థులు, తెలంగాణలో ఆంధ్రా విద్యార్థులు 15 శాతం ఓపెన్ కోటాలో వెళ్లొచ్చని రాష్ట్ర విభజన చట్టంలో చెప్పారు. కాబట్టి మార్చలేకపోయాం అని హరీశ్‌రావు గుర్తు చేశారు. డాక్టర్ కావాలని చాలా మంది పిల్లలు, వారి తల్లిదండ్రులు కలలు కంటుంటారు. ఆ విధంగా చదివిస్తారు. అలాంటి పిల్లల భవిష్యత్‌తో ఈ రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. 2014కు ముందు తెలంగాణలో మొత్తం 2850 ఎంబీబీఎస్ సీట్లు ఉంటే.. కేసీఆర్ వచ్చాక ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను 9వేలకు పెంచారు. ఈ ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. పెంచిన సీట్లు తెలంగాణ బిడ్డలకు దక్కేలా చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. తెలంగాణలో 2014లో 20 మెడికల్ కాలేజీల్లో 2850 సీట్లు ఉండే. ఈ సీట్లలో 280 సీట్లు ఓపెన్ కోటాలో ఉండే. కానీ మేం బాగా ఆలోచించి తెలంగాణ వచ్చిన తర్వాత 20గా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్యను 30 మెడికల్ కాలేజీలకు తీసుకెళ్లాం. తెలంగాణ వచ్చిన నాటికి ఉన్న కాలేజీల్లో 15 శాతం ఓపెన్ కోటా పెడుతాం. మేం పెట్టిన కాలేజీల్లో మాత్రం ఓపెన్ కోటా ఇవ్వలేదు.. 100 శాతం మా పిల్లలకు సీట్లు ఇస్తామని చెప్పి జీవో తీసుకువచ్చాం.. దాంతో 520 సీట్లు తెలం గాణ పిల్లలకు అదనంగా దొరికాయి. గుడ్డిగా అదే జీవో ఫాలో అయితే కొత్త కాలేజీల్లో కూడా ఇతర రాష్ట్రాల వారు వచ్చేవారు. రాష్ట్రం ఏర్పడే నాటికి ఉన్న విద్యాలయాల్లో 15 శాతం కోటా ఉంటది.. కానీ తర్వాత ఏర్పడ్డ కాలేజీల్లో మా పిల్లలకు దక్కాలని జీవో సవరణ చేశాం అని హరీశ్‌రావు తెలిపారు. ప్రయివేటు మెడికల్ కాలేజీల్లో బీ కేటగిరి సీట్లు ఉంటాయి. బీ కేటగిరిలో గతంలో దేశంలో ని ఎక్కడి వారైనా చదివే అవకాశం ఉండేది. మేం పర్మిషన్ ఇచ్చిన కాలేజీల్లో ఇతరులు చదవడానికి వీల్లేకుండా బీ కేటగిరి సీట్లలో తెలంగాణ పిల్లలకు అడ్మిషన్లు ఇవ్వాలని జీవో సవరించి వెసులుబాటు కల్పించాం. 24 మెడికల్ కాలేజీల్లో బీ కేటగిరి సీట్లలో లోకల్ రిజర్వేషన్లు తేవడంతో 1071 సీట్లు దక్కాయి. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పెట్టిన కాలేజీల్లో 520 ఎంబీబీఎస్ సీట్లు, బీ కేటగిరిలో లోకల్ రిజర్వేషన్లతో 1071 సీట్లు దక్కాయి. తెలంగాణ పిల్లలు డాక్టర్లు కావాలి.. మన పిల్లలకు మేలు జరగాలనే తనపనతో ఈ పని చేశాం. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంబీబీఎస్ అడ్మిషన్లలో అనాలోచితంగా తెలంగాణ పిల్లలకు నష్టం జరిగేలా జీవో తీసుకొచ్చారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. 2024 జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తి కావడంతో.. తెలంగాణ రాష్ట్రం స్థానికతను నిర్ధారించుకునేందుకు సొంత రూల్స్ ఫ్రేమ్ చేసుకునేందుకు అవకాశం దక్కింది. మన పిల్లలకు విద్యా ప్రవేశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక సమగ్రమైన ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. స్థానికతను నిర్ధారించేందుకు నియమ నిబంధనలు తయారు చేయాలి. కానీ అలాంటిదేవిరీ చేయకుండా.. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ అడ్మిషన్స్ కోసం జీవో నంబర్ 33 ఇచ్చింది. చివరి విద్యాసంవత్సరం నుంచి నాలుగేండ్లు ఎక్కడ చదివితే అక్కడ లోకల్ అని చెప్పారు. అంటే 9 నుంచి 12వ తరగతి వరకు ఎక్కడ చదివితే అది లోకల్ అని పేర్కొన్నారు. ఇది ఆల్రెడీ 1979 జీవోలో ఉంది. 2017 జీవోలో కూడా అదే ఉంది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 33 అసమగ్రంగా ఉంది. ఈ జీవో కారణంగా మన తెలంగాణ బిడ్డలు.. స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురుచూపులు

### స్థానిక ఎన్నికల వేళ పదవుల పందేరంపై ఆశ
### సిఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాకనే స్పష్టత

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** నామినేటెడ్ పోస్టుల కోసం కాంగ్రెస్‌లో మళ్లీ ఆశావహులు ఎదురు చూస్తున్నారు. స్థానిక ఎన్నికలు రాబోతున్న తరుణంలో పలువురు పదవు కోసం ఎదురు చూస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌లోకి కొత్తగా వచ్చి చేరే వారిని కీలక పదువులు అప్పగించవద్దని చాలా మంది సీనియర్లు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడు చాలా మంది పార్టీ కోసం కష్టపడి పని చేశారని వారినే పరిగణలోకి తీసుకొవాలని చెప్పుకొచ్చారు. దీన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకత్వం కొత్తగా పార్టీలో చేరే వారికి మంత్రిపదవులు ఇవ్వడం లేదని తేల్చి చెప్పినట్టు సమాచారం. ఇన్ని రోజులు వివిధ కారణాలతో మూడు విషయాలపై దాటవేత ధోరణితో వచ్చిన కాంగ్రెస్‌కు ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సిన టైం వచ్చింది. మరికొన్ని రోజుల్లో లోకల్ బాడీ ఎన్నికలు జరగనున్నాయి. అందులో కాంగ్రెస్ కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలంటే వారిని ప్రోత్సహించాల్సి ఉందని అంటున్నారు నేతలు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చాలా కీలక విషయాలపై నిర్ణయాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. అందులో ఒకటి మంత్రి వర్గ విస్తరణ, రెండోది పీసీసీ చీఫ్ నియామకం, మూడోది నామినేటెడ్ పోస్టుల భర్తీ. ఈ మూడు విషయాల కోసం కాంగ్రెస్ నేతలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత ఇదిగో విస్తరణ, అదిగో కొత్త పీసీసీ అంటూ రకరకాల లీకులు వచ్చాయి. కానీ అవేవీ నిజం కాదని తేలిపోయింది. అన్నింటికీ శ్రావణ మాసాన్ని ముహూర్తంగా చేసుకున్నారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం అమెరికా టూర్‌లో ఉన్న రేవంత్ రెడ్డి స్వరాష్ట్రానికి వచ్చిన తర్వాత ఢిల్లీ వెళ్తారని తెలుస్తోంది. అధినాయకత్వంతో ఈ మూడు విషయాలపై తేల్చనుందని అంటున్నారు. ఇప్పటికే ఒక దఫా నామినేటెడ్ పదువులు భర్తీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇంకా కీలకమైన విభాగాలు ఉండనే ఉన్నాయి. వాటిలో కొన్నింటినీ రెండో దఫాలో ప్రకటిస్తారని అంటున్నారు. మంత్రివర్గ విస్తరణ, తెలంగాణ పీసీసీ చీఫ్ నియామకం, నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఎప్పటి నుంచో కసరత్తు జరుగుతోంది. వివిధ దఫాలు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్, ఇతర సీనియర్ నేతలు అధినాయకత్వంతో ఈ మూడు అంశాలపై చర్చించారు. ఇంతలో బీఆర్ఎస్ నుంచి కీలకమైన నేతలు కాంగ్రెస్‌లో చేరడంతో వారికి ఛాన్స్ ఇస్తారేమో అని మరికొందరు కంగారు పడి అధినాయకత్వానికి విన్నపాలు చేశారు. ఇప్పుడు ఇటు పీసీసీ చీఫ్‌గా అటు సీఎంగా రెండు పదవులను నిర్వహిస్తున్న రేవంత్‌కు నేతల సమన్వయం ఇబ్బంది మారుతోందని చెబుతున్నారు. అందుకే పీసీసీ చీఫ్ నియామకం కూడా తప్పనిసరికానుంది. ఖాళీగా ఉన్న ఆరు పోర్ట్‌పోలియోలకు మాత్రం భారీగా పోటీ ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. దాదాపు 15 మంది వరకు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారట. సామాజిక కోటాలు, స్థానికత అంశాలను తెరపైకి తీసుకొచ్చి మంత్రిగా అవ్వాలని తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నారని టాక్ నడుస్తోంది. కొందరు రేవంత్ రెడ్డితో ప్రయత్నాలు చేస్తుంటే మరికొంత మంది నేరుగా అధినాయకత్వంతోనే సంప్రదింపులు జరుపుతున్నారని సమాచారం. తెలంగాణ పీసీసీ చీఫ్ పదవి మాత్రం బీసీ, లేదా ఎస్సీ, ఎస్టీ సమాజిక వర్గానికి ఇవ్వాలని ఓ అభిప్రాయానికి వచ్చినందున ఆ సామాజిక వర్గ నేతలే లాబీయింగ్ చేసుకుంటున్నారు.

## ఒకరోజు నా స్థానంలో కూర్చోండి

### ఒత్తిడి ఎలా ఉంటుందో తెలుస్తుంది

### న్యాయవాదిపై జస్టిస్ చంద్రచూడ్ అసహనం



**న్యూఢిల్లీ:** దేశంలోని కోర్టులు, న్యాయమూ ర్తులపై ఎంత ఒత్తిడి ఉందో అర్థం చేసుకోవాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఒక్కరోజు తన స్థానంలో కూర్చుంటే, మరోసారి జీవితంలో ఆ స్థానానికి రాకుండా పారిపోతారని స్పష్టంచేశారు. ముంబయి చెంబూర్ కాలేజీలో విద్యార్థులకు బురఖా, హిజాబ్‌ను రద్దుచేసిన వ్యవహారంపై దాఖలైన పిటిషన్ విచారణకు వచ్చినపుడు జస్టిస్ చంద్రచూడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతి న్యాయవాది తమ కేసునే మొదట విచారణ జరపాలంటూ కోరడం పట్ల సీజేఐ అసహనం వ్యక్తం చేశారు. అంతా తమ పిటిషన్ ముందుగా విచారణకు రావాలని కోరుతున్నారని, కానీ తమపై ఉన్న ఒత్తిడిని మాత్రం అర్థం చేసుకోవడంలేదని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. ప్రతి ఒక్క పిటిషన్‌పై తాము విచారణ జరుపుతామని, అందుకు ఒక తేదీ ఇస్తామన్నారు. న్యాయమూర్తులను, కోర్టును శాసించే పరిస్థితులు సరికాదని సీజేఐ స్పష్టంచేశారు.

## ఎస్సారెస్పీలోకి ఇన్ ఫ్లో

**బాల్కొండ, ప్రజానావ:** నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుండి బుధవారం 11121 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఎగువ ప్రాంతం నుండి నీరు చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1091 అడుగులు కాగా ప్రస్తుతం 1080.60 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు చెప్పారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 46.654 టీఎంసీ ల నీరు నిల్వ ఉంది.

## ఎస్సారెస్పీ కాలువలతో నీటి విడుదల

**బాల్కొండ, ప్రజానావ:** నిజామాబాద్ జిల్లా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీటి విడుదలకు అధికారు లు బుధవారం నుండి ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రస్థాయి సమీకృత నీటి ప్రణాళిక యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో ఈ వానాకాలం పంటలకు నీటి విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కాకతీయ, లక్ష్మీ, సరస్వతీ కాలువల ద్వారా నీటిని విడుదలకు అధికారులు సిద్ధం చేశారు. నేటి విడుదలను ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో జోన్ బి1 పరిధిలో కాకతీయ కాలువ ద్వారా 7 రోజులు పాటు నీటి విడుదల చేయనున్నారు. జోన్ బి2 పరిధిలో ఎల్.ఎం.డి వరకు 8 రోజుల పాటు నీటి విడుదలను అధికారులు చేయనున్నారు. దీంతో నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో 7.56 లక్షల ఎకరాల్లో వానాకాలం సాగుకు నీటి విడుదల దోహద పడనుంది. ప్రాజెక్టు ఆయకట్టు రైతులు నీటి విడుదల పట్ల ఆనంద వ్యక్తం చేస్తున్నారు.

## మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

- మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు
- బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నం

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను ఇవ్వాల్సిందేనని మహిళా కాం గ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు కేంద్ర ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఈ రిజర్వే షన్ తీసుకురాకుంటే యావత్ మహిళా లోకం ఆగ్రహాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమ లు చేయాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. దీంతో భారీగా మోహరించిన పోలీసులు మహిళా కాంగ్రెస్ కార్యకర్తలను గాంధీ భవన్ వద్ద అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సునీత రావు మాట్లాడుతూ.. నారీ న్యాయ్ హక్కు సాధించే వరకు పోరాటం చేస్తామన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలుచేయాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ వచ్చి ఉంటే నారి న్యాయ్ పేరిట ఇప్పటికే 33 శాతం రిజర్వేషన్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చేవాళ్లమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు అన్ని పార్టీలూ తమ పోరాటానికి మద్దతు తెలపాలన్నారు. పార్టీలకు అతీతంగా పోరాటం చేయాలని కోరారు. హక్కుల కోసం అందరం ఏకమవుదామని ఆమె పిలుపునిచ్చారు.

## వయనాడ్ విషాదం జాతీయ విపత్తుగా ప్రకటించాలి : రాహుల్



**న్యూఢిల్లీ:** కేరళలోని వయనాడ్ జిల్లాలో వరద ప్రభావంతో కొండచిరియలు విరిగిపడిన ఘటన దేశవ్యాప్తంగా సంచనలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘోర విపత్తులో ఇప్పటివరకు 400లకు పైగా మృతి చెందారు. 150 మంది ఆచుకీ తెలియకుండా పోయింది. అయితే ఈ ఘటనపై విపక్ష నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. బుధవారం లోక్‌సభలో జీరో అవర్‌లో మాట్లాడిన ఆయన.. కొండచరియలు విరిగిన ప్రాంతాలను సందర్శించానని తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని.. బాధితులల్లో కుటుంబంలో సభ్యులందరినీ కోల్పోయి ఒంటరిగా మిగిలినవారు కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాల్లో కేంద్రం బాధిత కుటంబాలకు అండగా ఉండాలని.. ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. అలాగే వారికి ఇచ్చే పరిహారాన్ని పెంచి.. సమగ్ర పునరావాసాన్ని కల్పించాలన్నారు..

## కేజ్రీవాల్‌ను మళ్లీ అరెస్టు చేయాలనుకుంటున్నారా..?

**న్యూఢిల్లీ:** ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవాల్ను మళ్లీ అరెస్ట్ చేయాలని చూస్తున్నారా అంటూ ఈడీని దిల్లీ హైకోర్టు ప్రశ్నించింది. మద్యం కుంభకోణంలో కేజీవాల్కు ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్ను సవాల్ చేస్తూ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దిల్లీ హైకోర్టులో పిటిషన్ వేసింది. బుధవారం దీనిపై విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నీనా బన్సల్ మాట్లాడుతూ "నేను అయోమ యంలో ఉన్నాను. మీరు అసలు ఏమి చేయాల నుకుంటున్నారు. కేజీవాల్ను మళ్లీ అరెస్టు చేయాలనుకుంటున్నారా " అంటూ ప్రశ్నించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కేసులో కేజీవాల్కు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు జూన్ 20న బెయిల్ మంజూరు చేసింది. కాగా రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును దిల్లీ హైకోర్టు నిలిపివేసింది. ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ వాదనలను వినే వరకు కేజీవాల్కు కల్పించిన బెయిల్ ఉపశమనంపై మధ్యంతర స్టే విధించిన విషయం తెలిసినదే.

# చేనేతకు మళ్లీ గడ్డు రోజులు

## కాంగ్రెస్ రాకతో కష్టాలు తప్పడం లేదు

## చేనేత దినోత్సవం సందర్భంగా కేటీఆర్ ఆవేదన



**హైదరాబాద్, ప్రజానావ:** నరాలను పోగులుగా చేసి.. తమ రక్తాన్ని రంగులుగా వేసి.. గుండె లను కండెలుగా మార్చి.. చెమట చుక్కల్ని చీరలుగా మలచి.. పేగులను వస్త్రాలుగా అం దించి.. మనిషికి నాగరికతను అద్దిన.. చేనేత కార్మికులందరికీ.. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాలపాటు దగాపడ్డ చేనేతరంగానికి బీఆర్ఎస్ పదేళ్ల ప్రగతి ప్రస్థానం..దేశ చరిత్ర లోనే ఓ స్వర్ణయుగం అని పేర్కొన్నారు.నేత కార్మికుల కష్టాలు తెలిసిన నాయకుడు.. మగ్గానికి మంచిరోజులు తెచ్చిన దార్శనికుడు.. వినూత్న పథకాలకు శ్రీకారంచుట్టిన పాలకుడు.. మన కేసీఆర్ అని కేటీఆర్ తెలిపారు. సమైక్యరాష్ట్రం లో ఆరేళ్ల బ్జడెట్ రూ.600 కోట్లే.. బీఆర్ఎస్ పాలనలో ఏడాదికి రూ.1200 కోట్లు ఇచ్చామ ని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోనే నేతన్నలకు గుర్తింపు, గౌరవం దక్కిందని.. ఎన్నో విప్లవాత్మక పథకాలకు చిరునామా మన తెలంగాణ అని తెలిపారు.దేశంలోనే తొలిసారి 50 శాతం సబ్సిడీతో చేనేత మిత్ర తీసుకొచ్చామని.. నేతన్నకు చేయూత పేరుతో త్రిఫ్ట్ ప్రత్యేక పొదుపు పథకం అని కేటీఆర్ తెలిపారు. నేతన్నకు బీమా పేరుతో 5 లక్షల రూపాయల ధీమా, 36వేల మంది నేతన్నల కుటుంబాలకు కొండంత అండ అందించామని చెప్పారు. 10,150 మంది చేనేత కార్మికులకు రూ.లక్ష వరకు రూ.29 కోట్ల రుణాల మాఫీ, చేనేత కళాకారులకు ఆసరా పెన్షన్‌తో ఆపన్న హస్తం.. ఇలా పద్మశాలీల ఆత్మగౌరవం పెంచే చారిత్రక నిర్ణయాలనేకం ఉన్నాయని తెలిపారు. సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని గ్టటెక్కించిన యజ్ఞం.. తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమమని కేటీఆర్ తెలిపారు. సిరిసిల్లలో అప్పరెల్ పార్క్ ఏర్పాటు.. ఓ సంకల్పమని పేర్కొన్నారు. వరంగల్‌లో కాకతీ య మెగా టెక్స్ టైల్ పార్క్.. ఓ సంచలనమని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేనేత రంగం లో చిరునవ్వులు చిందించాయని.. కానీ.. కాంగ్రెస్, బీజేపీ పాలనలో బతుకులు ఛిద్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ హయాంలో.. తొలిసారిగా చేనేత వస్త్రాలపై జీఎస్టీ పన్ను విధించారని, ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు రద్దు చేశారని, ఆల్ ఇండియా హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు రద్దు చేశారని, ఆల్ ఇండియా పవర్‌లూమ్ బోర్డు రద్దు చేశారని, చేనేత కార్మికుల త్రిఫ్ట్ పథకం రద్దు చేశారని, హౌస్ కం వర్క్ షెడ్ పథకాల రద్దు చేశారని, మహాత్మాగాంధీ బునకర్ బీమా పథకం రద్దు చేశారని, యార్న్ పై సబ్సిడీ 40 నుంచి 15 శాతానికి తగ్గించారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ పాలనలో.. మళ్లీ చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతినిత్యం చేనేత కార్మికుల కుటుంబాల్లో మరణమృదంగం మోగుతుందని అన్నారు. ఇప్పటికైనా ఇరు ప్రభుత్వాలు కళ్లు తెరవాలని సూచించారు. సంక్షోభం నుంచి గ్టటెక్కించాలని, బీఆర్ ఎస్ పాలనలో అమలైన పథకాలు కొనసాగిం చాలని డిమాండ్ చేశారు.

# కొత్త సిటీ లక్ష్యంగా సీఎం రేవంత్ ప్రచారం

- స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేసిన ప్రాంతంలోనే నిర్మాణం
- అమెరికా పర్యటనలో దీనిపైనా సిఎం ప్రస్తావన



**న్యూయార్క్:** తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో మరో కొత్త నగరాన్ని నిర్మిస్తానని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి దాన్నే చూపించి పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలను ఆహ్వాని స్తున్నారు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు, వివిధ పారిశ్రామికవేత్తల అవసరాలు, వారి సూచనలు, ప్రభుత్వ ఆలోచనలతో సరికొత్త పారిశ్రామిక విధానం తీసుకొస్తామని రేవంత్ రెడ్డి అంటున్నారు. ఫ్యూచర్ సిటీని హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామని చెబుతున్నారు. అత్యాధునిక హంగులతో కాలుష్యానికి, ట్రాఫిక్ సమస్యల్లేకుండా ఈ సిటీ నిర్మించ బోతున్నట్టు వారికి వివరిస్తున్నారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ముచ్చెర్లలో ఏర్పాటు చేయబోయే పోర్ట్ సిటీని ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడున్న మూడు సిటీల్లో భారీగా కాలుష్యం, ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నందున చాలా కంపెనీలు రావడానికి ఇబ్బంది ఎదురవుతోంది. అందుకే నాల్గో సిటీని తెరపైకి తీసుకొచ్చిన రేవంత్ రెడ్డి పారిశ్రామికవేత్తలకు పరిచయం చేస్తున్నారు. అక్కడ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌తోపాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్టు పేర్కొంటున్నారు. మెడికల్, టూరిజం, స్పోర్ట్స్,సాఫ్ట్‌వేర్, ఫార్మా విభాగాలు అక్కడ ఎస్టాబ్లిష్ చేస్తామని వారికి హామీ ఇస్తున్నారు. న్యూయార్క్ లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలతో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఫార్మా, బయోటెక్, ఐటీ, టెక్నాలజీ, షిప్పింగ్, ఈవీ రంగాలకు చెందిన కంపెనీ ప్రతినిధులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, వారికి కావాల్సిన ఎమినిటీస్ గురించి చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే వారికి ఎలాంటి సమస్య రాకుండా చూస్తామని, కంపెనీ విస్తరణ పక్రియను కూడా సులభతరం చేస్తామని హామీ ఇచ్చారు. ఒక్క హైదరాబాద్ కాకుండా తెలంగాణలోని చాలా జిల్లాలు పారిశ్రామిక ఎదుగుదలకు అవకాశాలు ఉన్నాయని వాటిని క్లస్టర్లుగా విభజించి ప్రగతిపథంలోకి తీసుకొస్తామన్నారు రేవంత్. అందుకే పారిశ్రామిక వేత్తలంతా తెలంగాణ వస్తే కలిసికట్టుగా పని చేసి అన్నిరంగాల్లో తెలంగాణను నెంబర్ వన్‌లో నిలుపుదామని పిలుపునిచ్చారు. అనంతరం పలు కంపెనీలు తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నట్టు ఒప్పందలపై సంతకాలు చేశాయి. అలాంటి వాటిలో బయో ఫ్యూయల్స్ తయారీ సంస్థ స్వచ్ఛ్ బయో ఒకటి. తెలంగాణ సెకండ్ జనరేషన్ సెల్యులోసిక్ బయో ఫ్యూయల్ ప్లాంట్‌ను ఏర్పాటుకు ఓకే చెప్పింది. తొలి దశలో వెయ్యి కోట్ల పెట్టుబడిలో నిర్మించనున్నారు. ఈ ప్లాంట్ నిర్మాణంతో 500 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగాలు లభించ నున్నాయి. తెలంగాణలో ఆర్సీసియం కంపెనీ తొలిసారిగా విస్తరించేందుకు ఓకే చెప్పింది. ఈ కంపెనీ రాకతో 500 మందికి ఉద్యోగ అవకాశాలు దొరబోతున్నాయి. హెచ్‌సీఏ హెల్త్‌కేర్ అనే సంస్థ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను హైదారాబాద్‌లో ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సంస్థ ఇప్పటికే 2024 మార్చిలో ఇంక్యుబేషన్ ఫెసిలిటీని స్టార్ట్ చేసింది. ట్రైజిన్ టెక్నాలజీస్ కంపెనీ హైదరాబాద్‌లో తమ ఏఐకు సంబంధించిన ఇన్నోవేషన్ అండ్ డెలివరీ సెంటర్‌ను ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. వచ్చే మూడేళ్లలో వెయ్యి మందికిపైగా ఉద్యోగులను నియమించుకోనుంది. ఆరు నెలల్లోనే కంపెనీ వర్క్స్ ప్రారంభం కానున్నాయి.

# రైతుల ఆత్మహత్యలు బాధాకరం : హరీష్‌రావు



**హైదరాబాద్, ప్రజానావ:** ఖమ్మం జిల్లాలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం దురదృష్టకరమని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఖమ్మం రూరల్ మండలం జాన్‌పహాడ్ తండాకు చెందిన రైతు ఏలేటి వెంకట్‌రెడ్డి మృతి బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసిన వెంకట్‌రెడ్డి మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి మరణించడం ప్రజాపాలనపై రైతులు కోల్పోతున్న నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. ఇటీవలే ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలంలో జరిగిన రైతు ఆత్మహత్య ఘటన మరువక ముందే మరో రైతు మరణించడం శోచనీయమని హరీశ్‌రావు అన్నారు. రైతులు అధైర్యపడవద్దని.. ఏమైనా సమస్యలుంటే పోరాడి పరిష్కరించుకుందామని తెలిపారు. చావు సమస్య పరిష్కారానికి మార్గం కాదని అన్నారు.


# భద్రాచలంలో రెండ్రోజులుగా భారీ వర్షం

## నీట మునిగిన రామాలయ ప్రాంతం

## అధికారుల తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల



**భద్రాద్రి కొత్తగూడెం, ప్రజానావ:** ఇరిగేషన్ అధికారులపై మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామాల యం అన్నదాన సత్రం వద్ద వరద నీరు నిలవడంపై మండిపడ్డారు. మంత్రి ఆదేశాలను గోదావరి నది కరకట్ట స్లూయిజ్ లాక్‌లను ఎత్తి పట్టణంలోని వర్షపు నీటిని గోదావరిలోకి ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. ఈ క్రమంలో ఉదయం నుంచి నీటిలో మునిగి వున్న రామాలయ ప్రాంతం వాసులకు ఉపశమనం కలిగన్లట్టెంది. కాగా.. గోదావరి నీటిమట్టం 33 అడుగులు ఉండటంతో లాక్‌లను అధికారులు ఎత్తివేశారు. మళ్లీ గోదావరి ప్రవాహం 36 అడుగులకు చేరితేనే లాకులను మూసివేయనున్నారు. కాగా.. భద్రాచలంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో రామాలయం పరిసర ప్రాంతాల్లో వరద నీరు పోటెత్తింది. పట్టణంలోని వర్షపు నీరు డ్రైనేజ్ నీరు మోటార్లతో ఎత్తిపోయక పోవడంతో వరద నీరు నిలిచిపోయింది. దేవస్థానం ఆలయం అన్నదాన సత్రంలోకి చేరిన వరద నీరు చేరింది. దీంతో అన్నదానం సత్రాన్ని మూసివేశారు. భక్తులకు పాకెట్‌ల ద్వారా అన్నదానానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. గోదావరి నది కరకట్ట స్లూయిజ్‌ల నుండి వర్షపు నీటిని పంప్ చెయ్యకపోవడంతోరామాలయ ప్రాంతం నీట మునిగింది. విషయం తెలిసిన మంత్రి తుమ్మల.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గోదావరి నది కరకట్ట స్లూయిజ్ లాక్‌లను ఎత్తి పట్టణంలోని వర్షపు నీటిని గోదావరిలోకి విడుదల చేయడంతో రామాలయ ప్రాంతం వాసులకు ఉపశమనం కలిగింది. మరోవైపు.. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ కుసుమ హరినాథ్ బాబా మందిరంలో ఈశాన్య మండపానికి బీటలు వారాయి. భారీ వర్షాల కారణంగా ఈశాన్యం మండపం కూలడానికి సిద్ధంగా ఉంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండప అడుగుభాగం పూర్తిగా దెబ్బతిన్నది. కింద భాగం పెచ్చులు ఊడి కింద పడటంతో తృటిలో భారీ ప్రమాదం తప్పింది. విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అక్కడకు చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మండపాన్ని పూర్తిగా తీసివేసి పరిస్థితి చక్కదిద్దాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పాటిల్ ఆదేశాలు జారీ చేసింది.




# ట్రంప్ హత్యకు భారీ కుట్ర

## పాక్ జాతీయుడిని అరెస్ట్ చేసిన అమెరికా

**వాషింగ్టన్:** ఇరాన్‌తో లింకులు ఉన్న పాకిస్థానీ జాతీయుడిని .. అమెరికా అరెస్టు చేసింది. అమెరికా రాజకీయవేత్తలను హత్య చేసేందుకు ఆ పాక్ వ్యక్తి ప్లాన్ వేసినట్లు న్యూయార్క్ ఫెడరల్ కోర్టు పేర్కొన్నది. రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసేందుకు అతను ప్లాన్ వేసినట్లు అనుమానిస్తున్నారు. పాక్‌కు చెందిన అసిఫ్ రాజా మెర్చంట్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై అభియోగాలు నమోదు అయినట్లు అమెరికా అటార్నీ జనరల్ మెర్రిక్ గార్లాండ్ తెలిపారు. జనరల్ ఖాసిమ్ సోలేమాని హత్య తర్వాత అమెరికా ప్రభుత్వాధికారులపై ఇరాన్ టార్గెట్ చేసినట్లు తెలుస్తోందన్నారు. పాకిస్థాన్ జాతీయుడైన అసిఫ్ రాజా.. కిరాయి హత్యలకు పాల్పడేందుకు సిద్ధమైనట్లు ఎఫ్‌బీఐ చీఫ్ క్రిస్టోఫర్ వ్రే తెలిపారు.అసిఫ్ రాజాకు ఇద్దరు భార్యలు ఉన్నారు. ఒకరు పాకిస్థాన్‌లో, మరొకరు ఇరాన్‌లో ఉన్నారు. రెండు దేశాల్లోనూ అతనికి పిల్లలు కూడా ఉన్నారు. అసిఫ్ వేసిన ప్రణాళికలు స్పై థ్రిల్లర్‌ను తలపిస్తున్నట్లు కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. డాక్యుమెంట్లను దొంగలించడం, యూఎస్బీ డ్రైవర్లను చోరీ చేయడం, నిరసనలు చేపట్టడం, ప్రభుత్వ అధికారులను చంపడం లాంటి ఎ÷-లాన్ వేశారు. అన్ని ప్రణాళికలకు కోడ్‌లు ఉన్నట్లు కోర్టు తెలిపింది. ఇటీవల పెన్సిల్వేనియాలో ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నానికి అసిఫ్‌తో లింకు లేదు. కానీ ఆ తరహా అటాక్‌లక ఎలాన్ వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అండర్‌కవర్ ఎఫ్‌బీఐ ఏజెంట్ల ద్వారా హత్యలకు ఎలాన్ వేసినట్లు న్యూయార్క్ ఎఫ్‌బీఐ ఫీల్డ్ ఆఫీస్ అసిస్టెంట్ డైరెక్టర్ క్రిస్టీ కర్టిస్ తెలిపారు.

# నిండుకుండలా సాగర్ జలాశయం

## 22 గేట్లు ఎత్తి కొనసాగిస్తున్న నీటి విడుదల



**నాగార్జునసాగర్, ప్రజానావ:** శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దాంతో సాగర్ డ్యామ్ 22 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి మట్టం 584.50 అడుగులకు చేరుకుంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 295.99 టీఎంసీల నీరు నిలువ ఉంది. మరోవైపు శ్రీశైలం జలాశయానికి కూడా వరద భారీగా కొనసాగుతోంది. జలాశయం 10 గేట్లను 12 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశంయ ఇన్ ఫ్లో 2,74,443 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 3,72,053 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 883.20 అడుగులు. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 205.6627 టీఎంసీల నీరు నిలువ ఉంది. మరోవైపు సూర్యాపేట జిల్లాలోని పులిచింతల ప్రాజెక్టు ఇన్ ఫ్లో 3,05,200 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 20,000 క్యూసెక్కులుగా ఉంది. పులిచింతలకు ఎగువ నుంచి వస్తున్న వరద 3 లక్షల 27 వేల క్యూసెక్కులు. దాంతో విద్యుత్ ఉత్పత్తి కోసం పది వేల క్యూసెక్కుల నీటిని మళ్లించారు. పులిచింతల పూర్తి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 26.79 టీఎంసీల నీరు నిలువ ఉంది. వరద మరింత పెరగనుండటంతో పులిచింతల దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచించారు.



# నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

**వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి**

**చందుర్తి, ప్రజానావ:** నేరాల నియంత్రణనే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని, అందులో భాగంగానే ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశానుసారం బుధవారం ఉదయం చందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవునితండాలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్స్ లేని 31 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అక్రమ గుడుంబా తయారీకి కోసం నిల్వ ఉంచిన సామగ్రి, అక్రమ కలప దుంగలను స్వాధీనం చేసుకొని బాధ్యులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మట్లాడుతూ ప్రజల రక్షణ గురించి ప్రజలలో భద్రతాభావం సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ కల్పించడం, ప్రజల యొక్క సమస్యలు నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. పట్టణ, గ్రామాలు, కాలనీల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు.. నేరస్తులు వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా సంచరిస్తే డయల్ 100 కాల్ కు చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేస్వర్లు, ఎస్ఐ, శ్రీకాంత్, శేఖర్ రెడ్డి, అశోక్, పోలీస్ సిబ్బంది, డిస్ట్రిక్ట్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులు మొక్కలను నాటి స్వచ్ఛదనంలో పాల్గొన్నారు. స్వచ్ఛమైన పర్యావరణాన్ని యథావిధిగా ముందుతరాలకు అందించాలన్నారు. ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం ద్వారానే మనిషి మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందని, ఈ కార్యక్రమాన్ని ఒకటి, రెండు రోజులకు పరిమితం చేయకుండా జీవన విధానంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

**- చందుర్తి, ప్రజానావ**



# బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఆత్మీయ అభినందన

**చందుర్తి, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఆత్మీయ అభినందన కార్యక్రమంలో అల్లం లింగయ్య, మల్లయ్య, శంకర్, ముత్యపు సందీప్ ఉపాధ్యాయులకు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో బండి ప్రదీప్ కుమార్, మాజీ సర్పంచ్ దుమ్ము అంజయ్య, మాజీ ఎంపీటీసీ వనజ దేవస్వామి, ప్రధానోపాధ్యా యులు చంద్రశేఖర్ రాజు, బాబు, ప్రభాకర్ మనీ, నాగేష్ అజయ్, శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ కేంద్ర ప్రధాన కార్యాలమైన ఇంటింటా ఇన్నోవేషన్ 2024 ప్రచారంలో భాగంగా బుధవారం రాజన్న సిరిసిల్లలో నిర్వహించిన 'వాక్ ఫర్ ఇన్నోవేషన్ ' కార్యకమం శివనగర్ జెడ్పీహెచ్ స్కూల్ నుంచి బస్టాండ్ వరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యకమానికి డీఈఓ రమేశ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన వెంట జిల్లా సైన్స్ అధికారి దేవయ్య , ఈడీఎం శ్రీనివాస్, జిల్లా కోఆర్డినేటర్ అనిల్, స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**- సిరిసిల్ల, ప్రజానావ**




# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**- హాజరైన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**సిరిసిల్ల, ప్రజానావ:** జాతీయ చేనేత దినోత్సవాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత బస్ స్టాండ్ వద్ద ఉన్న నేతన్న విగ్రహానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ పూల మాలలు వేశారు. అనంతరం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కే కే మహేందర్ రెడ్డి, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్ శాఖ ఏడీ సాగర్, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మురికి నిల్వ ఉండకుండా చూసుకోవాలి

- లోతట్టు ప్రాంతాల్లో మొరం పోయించాలి
- స్వచ్ఛదనం.. పచ్చదనం జిల్లా ప్రత్యేక అధికారి శృతి ఓఝా
- జిల్లెల, నేరెళ్లలో కలెక్టర్‌తో కలిసి పర్యటన

**తంగళ్లపల్లి/వేములవాడ, ప్రజానావ:** మురికి నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని స్వచ్ఛదనం.. పచ్చదనం జిల్లా ప్రత్యేక అధికారి, ఇంటర్మీడియెట్ బోర్డు డైరెక్టర్ శృతి ఓఝా ఆదేశించారు. స్వచ్ఛదనం.. పచ్చదనంలో భాగంగా మూడో రోజు కార్యక్రమానికి స్వచ్ఛదనం.. పచ్చదనం జిల్లా ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి బుధవారం తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల, నేరెళ్లలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లెలలో మొక్కలు నాటారు. సెగ్రిగేషన్ షెడ్ ను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి, స్థానికులతో మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురికి కాలువల్లో పూడిక తీయించాలని, లోతట్టు ప్రాంతాలు, నీటి నిల్వగల ప్రదేశములను గుర్తించి, మొరం నింపాలని, నిల్వ నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని, మురికి కాలువల చివర, నీటి పారుదల సౌకర్యం లేని, నీటి నిల్వ గల ప్రదేశాలలో కమ్యూనిటీ సోక్ పిట్స్ లేదా ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆదేశించారు. ఇక్కడ. సిరిసిల్ల ఆర్డీఓ రమేశ్, డీఆర్డీఓ శేషాద్రి, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**వేములవాడ ప్రభుత్వ కళాశాలను పరిశీలన**

వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ శ్రుతి ఓఝా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లి, విద్యార్థులతో మాట్లాడారు. ఉచితంగా పంపిణీ చేసిన అన్ని పుస్తకాలు వచ్చాయా? అని ఆరా తీశారు. ఇప్పటి వరకు ఎక్కడి దాకా సిలబస్ పూర్తి అయిందని అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో కావాల్సిన వసతుల పై ప్రిన్సిపాల్ శరత్ కుమార్ శర్మను ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ ఆరా తీశారు.

## దొంగతనం కేసులో నిందితుడికి జైలు, జరిమానా

**సిరిసిల్ల, ప్రజానావ:** దొంగతనం కేసులో నిందితుడికి జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఏ. ప్రవీణ్ బుధవారం తీర్పు వెలువరించినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్గిల్ చెరువు సమీపంలోని కట్ట మైసమ్మ గుడిలో పనిచేసే శ్రీనివాస్ ఈ ఏడాది ఫిబ్రవరి 27న రాత్రి 7 గంటల సమయంలో గుడికి తాళం వేసి వెళ్లిపోయాడు. తిరిగి మరునాడు ఉదయం 6 గంటలకు కట్ట మైసమ్మ గుడి వద్దకు రాగా, గుడి గేటు తాళంతో పాటు హుండీ తాళం పగులగొట్టి కనిపించింది. అందులో దాదాపు రూ.7వేల నగదును గుర్తు తెలియని దొంగలు ఎత్తుకుపోయారని ట్రాక్టర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మరుపాక శ్రీనివాస్ కు తెలపగా, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి గుడిలో దొంగతనం చేసిన సిరిసిల్ల పట్టణం విద్యానగర్‌కు చెందిన కొడం లక్ష్మణ్ ఏలకన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. విచారణ అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుముల సందీప్ ద్వారా నేరస్తుడు కోర్టులో నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ కోడం లక్ష్మణ్‌కు 18 నెలల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

# రైతు రుణాల రీ షెడ్యూల్ పేరుతో భారీ మోసం

## లక్షలు దోచేసిన బ్యాంక్ ఉద్యోగి

**పెద్దకొత్తపల్లి, ప్రజానావ:** బ్యాంకును నమ్మి వచ్చే ఖాతాదారుల సొమ్ము ఆ బ్యాంక్ లోనే అక్రమార్కులు స్వాహా చేసేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులను టార్గెట్ చేసుకుని కుచ్చుటోపీ పెట్టేశారు. ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై గుట్టుగా ఖాతాదారుల సొమ్ము లక్షల రూపాయను సొంతానికి వాడుకున్నాడు బ్యాంక్‌లో పనిచేసే బిజినెస్ కోఆర్డినేటర్. విషయం తెలుసుకున్న బ్యాంక్ ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల గ్రామంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో ఖాతాదారులను మోసం చేసిన ఘటన కలకలం రేపుతోంది. బ్యాంక్‌లో బిజినెస్ కరస్పాండెంట్ గా పనిచేస్తున్న దేవేందర్ అనే వ్యక్తి అమాయక ఖాతాదారుల సొమ్మును హాంఫట్ చేశాడు. గ్రామాల నుంచి వచ్చే నిరక్షరాస్యులైన కస్టమర్స్ ను మోసం చేస్తూ వారి సొమ్మును సొంతానికి వాడుకున్నాడు. ఆన్ లైన్ గేమ్స్ కు బానిసై ఖాతాదారుల రుణాలను నొక్కేశాడు. బంగారు రుణాలు, క్రాప్ లోన్లను అసరాగా చేసుకొని లక్షల రూపాయలు మాయం చేశాడు దేవెందర్. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ఖాతాదారులకు మాయమాటలు చెప్పి వారికి సహాయం చేసినట్లుగా నటించి వారి సొమ్మును మింగేశాడు. పూర్తిగా రుణాలు చెల్లించే రుణాలను రీ షెడ్యూల్ చేసి ఆ రుణాన్ని తన్నుకుపోయిన ఘటనలు చాలానే వెలుగు చూశాయి. బ్యాంక్ అధికారులకు సంబంధించిన ఐడిలు ప్రైవేటు వ్యక్తిగా ఉన్న బిజినెస్ కో ఆర్డినేటర్ కు ఇవ్వడం ద్వారా అమాయక ప్రజలను ఈజిగా బురిడీ కొట్టించాడు.

**రైతులకు తెలియకుండానే లోన్ల రీ షెడ్యూల్**

గత ప్రభుత్వంలో రుణ మాఫీ పొందిన ఒక రైతు మిగిలిన రూ.12 వేల రూపాయలు కట్టి రుణం మొత్తం పూర్తిగా చెల్లించాడు. అయితే మళ్లీ రుణం కావాలని కోరగా అన్ని కాగితాలపై సంతకాలు చేయించుకున్నారు. మేనేజర్ లేడు తర్వాత ఇస్తాం అన్నారు. చివరికి వివిధ కారణాలు చెప్పి అతనికి రుణానికి సంబంధించిన సొమ్ము ఇవ్వలేదు. కొద్దిరోజుల తర్వాత బ్యాంక్ మేనేజర్‌ను కలిస్తే రుణం తీసుకుని మళ్లీ తీసుకోవడానికి ఎలా వచ్చావని అడిగారు. అయితే ఘటనలో బిజినెస్ కో ఆర్డినేటర్ దేవేందర్ మొత్తం లక్ష రూపాయలు డ్రా చేసుకున్నాడు. ఇలా చాలా మంది రైతులకు వివిధ కారణాలు చెప్పి వారి రుణాలను నొక్కేసాడు. తమ రుణాల సొమ్మును తన్నుకు పోయిన



దేవేందర్ పై పోలీసులను ఆశ్రయించారు రైతులు, ఖాతాదారులు. బ్యాంకులో జరిగిన స్కాంకు సంబంధించి పూర్తి వివరాలు అందించారు. దీంతో ఘట నపై కొల్లాపూర్ సీఐ నేతృత్వంలో ప్రాథమిక విచారణ చేస్తున్నారు. పలువురు బ్యాంక్ సిబ్బందిని పిలిచి వివరాలు తెలుసుకున్నారు. కేసుపై పూర్తి అవగాహన అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నారు. బిజినెస్ కో ఆర్డినేటర్ గా పనిచేస్తున్న దేవేందర్‌కు బ్యాంక్ సిబ్బంది సహకారం అందించినట్లు తెలుస్తోంది. వ్యవహారంపై లోతుగా విచారణ చేస్తే పలువురు బ్యాంక్ సిబ్బంది గుట్టు రట్టయ్యే అవకాశం ఉందని ఖాతాదారులు చెబుతున్నారు.




# పల్లె పోరుకు సై

**అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ పాటికే సర్పంచ్ ఎన్నికలు ముగిసి సర్పంచ్లు పాతబడేవారు. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఆశావహులు ఎప్పుడెప్పుడు ఎన్నికలు నిర్వహిస్తారా అని ఎదురు చూడాల్సి వస్తోంది. ఇంకా ఎన్నికలకు నెలలు పట్టే అవకాశం ఉ ండటంతో అప్పటిదాకా ప్రజల్లో ఉంటూ వారి మద్దతుకోసం ఆశావహులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆదిలాబాద్ జిల్లాలో 468 పంచాయతీలు ఉన్నాయి.వీటికి ఈ ఏడాది జనవరి 31తో గడువు ముగియడంతో ఆరు నెలలు ప్రత్యేక పాలన విధించారు. ఈ సమయం కూడా జూలైతో ముగియగా, మళ్లీ పెంపు అనివార్యమైంది. ఆరు నెలలు గడిచినా ఎన్నికలు నిర్వహించకపోవడంతోఎన్నికల కోసం ఎదురుచూసిన గ్రామ నాయకులు ఇక ప్రభుత్వ కార్యక్రమాలలో హల్చల్ చేస్తుప్రజల దృష్టిని ఆకర్శించే ప్రయత్నాలు మొదలెట్టారు.**

**- ప్రజానావ ప్రత్యేకం**

## ఆశావహుల సందడి

- కొన్నిచోట్ల తాజామాజీ సర్పంచ్లు
- మరికొన్నిచోట్ల అధికారపార్టీ శ్రేణులు
- ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నాలు
- ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న నాయకులు
- రిజర్వేషన్లపై అంతర్మథనం

ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా తాము పోటీలో ఉ ంటామని సంకేతాలు ఇస్తున్నారు. కొన్ని చోట్ల ప్రజల్లో పేరున్న తాజా మాజీలు మళ్లీ ప్రజలమధ్యే ఉంటుండగా, మరికొన్ని చోట్ల అధికారపార్టీకి చెందిన నాయకులు ప్రభుత్వం తమదేనని, తాముంటేనే పనులవుతాయని ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో నలుగురు, ఐదుగురు ఆశావహులు తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి చెందిన సర్పంచే 90శాతం మంది నెగ్గారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో ఈ సారి తమను ఆదరిస్తారని కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఆశావహుల సందడి నెలకొంది. ప్రభుత్వ కార్యక్రమాలు, పండగల సందర్భంగా అధికారపార్టీ శ్రేణుల సందడి కనిపిస్తోంది. ఇటీవల జరిగిన రెండు విడతల రుణమాఫీ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో రుణమాఫీ అయిన రైతులను కలిసి వారితో సంబురాలు చేయించడం. తాజాగా ప్రభుత్వం అమలుచేస్తున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలోనూ ఆశావహుల సందడే కనిపిస్తోంది. పంచాయతీలకు రెండుపర్యాయాలు ఒకే రిజర్వేషన్ అంటే గత ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం చట్టం చేసింది. ప్రస్తుతం అవే రిజర్వేషన్లు ఉంటాయని ఆయా సామాజిక వర్గాలకు చెందిన ఆశావహులు తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రభుత్వం మారడంతో ఒకవేళ చట్టంలో మార్పులు చేసి కొత్త రిజర్వేషన్లు అమలుచేస్తే ప్రస్తుత ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లినట్లవుతుంది. అప్పుడు కొత్త నాయకులు తెరపైకి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుత ఆశావహులను లోలోన రిజర్వేషన్ల భయం కూడా వెంటాడుతోంది.

## ప్రత్యేక పాలనతో పల్లెలు

పంచాయతీలలో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. ఇప్పటికే ఆరు నెలలు గడిచిపోగా, మరో మూడునెలలు వారి పాలనే కొనసాగే అవకాశాలున్నాయి. ప్రత్యేక అధికారులుగా మండలస్థాయి అధికారులే ఉండటంతో వారి కార్యాలయాల్లోని పనుల్లోనే చాలామంది బిజీగా ఉండగా పంచాయతీపాలన అదనపు భారం అవుతుందని పలువురు అధికారులు వాపోతున్నారు. కొందరికి రెండేసి గ్రామాలున్నాయి. దీంతో ఆయా గ్రామాలపై పూర్తిస్థాయి పర్యవేక్షణ చేయలేకపోతు న్నారు. పంచాయతీ కార్యదర్శులపైనే భారం పడుతోంది. ఏ పని ఉన్నా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అధికారుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. నిధులు కూడా లేకపోవడంతో చిన్నచిన్న పనులు కూడా చేయించలేకపోతున్నామని కార్యదర్శులు వాపోతున్నారు. కొందరు ఆశావహులు చిన్నచిన్న పనులకు సొంతంగానే ఖర్చు చేస్తున్నారు. లైట్లు వేయడం, రోడ్లపై మొరం వేయించి మరమ్మతులు చేయించడం వంటి పనులు చేయిస్తున్నారు.





# వయనాడ్ బాధితులకు ప్రభాస్ అండ

## 2కోట్ల విరాళం ప్రకటించినట్లు టీమ్ ప్రకటన

కష్టాల్లో ఉన్నవారికి చేయూత అందించడానికి నటుడు ప్రభాస్ ఎప్పుడూ ముందుంటారు. తాజాగా ఆయన మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. కేరళలోని వయనాడ్ జిల్లాలో చోటుచేసుకున్న విషాదాన్ని దృష్టిలో ఉంచుకుని భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈమేరకు కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు ప్రభాస్ రూ.2 కోట్లు విరాళం ఇస్తున్నట్లు ఆయన టీమ్ తెలిపింది. దీనిపై సినీ ప్రియులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. టాలీవుడ్ నుంచి అంత మొత్తంలో విరాళాన్ని చెల్లించిన హీరో ఆయనే కావడం విశేషమని నెటిజన్లు అనుకుంటున్నారు. ఆయన గొప్ప మనసుని మెచ్చుకుంటున్నారు. వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన అందరినీ కలచివేస్తోంది. సహాయక చర్యల కోసం పలువురు సినీతారలు ముందుకొచ్చి ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఆ విషాద ఘటనపై స్పందించిన చిరంజీవి, రామ్‌చరణ్ రూ.కోటి విరాళంగా ప్రకటించారు. అల్లు అర్జున్ రూ.25 లక్షలు కేరళ సీఎం సహాయ నిధికి అందిస్తున్నట్లు తెలిపారు. హీరో సూర్య, ఆయన భార్య జ్యోతిక, సోదరుడు కార్తి సంయుక్తంగా రూ.50 లక్షలు, నయనతార – విఘ్నేశ్ శివన్ దంపతులు రూ.20 లక్షలు మలయాళ నటులు మమ్ముట్టి, ఆయన తనయుడు దుల్కర్ సల్మాన్ కలిపి రూ.35 లక్షలు, ఫహాద్ ఫాజిల్ రూ.25 లక్షలు, కమల్ హాసన్ రూ. 25 లక్షలు, విక్రమ్ రూ.20 లక్షలు, రష్మిక రూ.10 లక్షల విరాళం ప్రకటించారు. మరోవైపు నటుడు మోహన్‌లాల్ స్వయంగా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. తాను వ్యవస్థాపకుడిగా ఉన్న విశ్వశాంతి ఫౌండేషన్ ద్వారా రూ. 3 కోట్ల విరాళం బాధితుల కోసం ఇస్తున్నట్టు తెలిపారు.



# ట్రెండ్ అవుతున్న దేవర చుట్టమల్లే పాట

తారక్ ఎలా ఉన్నారు? ఆయన పక్కన జాన్వీ ఎలా ఉన్నారు? వారిద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంది? ఇప్పుడు దేవర పాటను విన్న వారందరూ ఇదే డిస్కస్ చేసుకుంటున్నారు. మరికొందరు ఈ పాటను ఓ వైపు ఆస్వాదిస్తూనే... ఇంకెక్కడో విన్నట్టుందే అని ఆరా తీస్తున్నారు... ఇంతకీ మీరు పాటను విన్నారా? ఓ సారి వినేద్దాం రండి... చుట్టమల్లే చుట్టేస్తోంది తుంటరి చూపూ అని హస్కీగా పాట మొదలవుతుంటే అందరి చూపూ జాన్వీ మీదే వాలిపోయింది. తారక్ - జాన్వీ ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ అదిరిందంటున్నారు ఫ్యాన్స్. కొరటాల టేకింగ్‌కి కూడా మంచి మార్కులు పడుతున్నాయి. ఇంకెప్పుడు? ఇంకా ఎప్పుడూ అంటూ ప్రేక్షకులు పదే పదే అడిగితే ఊరించి ఊరించి విడుదల చేశారు ఈ పాటను. చుట్టమల్లే సాంగ్ వినగానే కొందరు ఆస్వాదించినా, మరికొందరు మాత్రం ఈ ట్యూన్ ఎక్కడో విన్నట్టుందే అంటూ అనిరుద్ బాణీకి పోలికలు వెతకడం మొదలుపెట్టేశారు.

# సిటాడెల్‌కి సూపర్ రెస్పాన్స్!

పక్కా యాక్షన్ స్క్రిప్ట్ ఉంటే అసలు ఏమాత్రం ఆలోచించకుండా సామ్‌ని అప్రోచ్ అవ్వొచ్చనే కాన్ఫిడెన్స్ ని మరోసారి క్రియేట్ చేశారు డేరింగ్ అండ్ డ్యాషింగ్ బ్యూటీ సమంత రూత్ ప్రభు. ఆమె నటించిన సిటాడెల్ టీజర్ చూసిన వారు ఫిదా అవుతున్నారు. క్షణం కూడా ఊపిరి పీల్చుకోనివ్వనంత ఇంటెన్స్ తో ఉందా టీజర్.. యస్ ఇప్పుడు సిటాడెల్ హనీబన్నీ టీజర్ చూసిన వాళ్లందరూ ఈ విషయం గురించే మాట్లాడుకుంటున్నారు. ఫిట్‌నెస్ అంటే ఇలా ఉండాలంటే సమంత అప్పియరెన్స్ గురించి చెప్పుకుంటున్నారు. ఇంతకు ముందు రాజ్ అండ్ డీకే డైరక్షన్‌లో ఫ్యామిలీమేన్2లోనూ యాక్షన్ ఎపిసోడ్స్ ఇరగదీశారు సమంత. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి మరింత స్టైలిష్ గా గన్స్ ని హ్యాండిల్ చేశారు. ఓ వైపు సరదా అమ్మాయిగా, మరో వైపు పాపతో ఇంటెన్స్ సీన్స్, ఇంకో వైపు పక్కా యాక్షన్ ఎపిసోడ్స్ లో మెప్పించారు సామ్. వరుణ్‌ధావన్‌కీ, సామ్‌కి పర్ఫెక్ట్ సీరీస్ అవుతుందనే టాక్ అప్పుడే మొదలైంది. వర్త్ వెయిటింగ్ అండ్ వర్త్ వాచింగ్ అంటూ పాజిటివ్‌గా రియాక్ట్ అవుతున్నారు నెటిజన్లు. 2024లో నా వైపు నుంచి నేను వచ్చేస్తున్నానహో అని జబర్దస్త్ గా డిక్లేర్ చేశారు మేడమ్ సమంత.



# నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురుచూపులు

### స్థానిక ఎన్నికల వేళ పదవుల పందేరంపై ఆశ


### సిఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాకనే స్పష్టత




**హైదరాబాద్, ఆగస్ట్ 7 :** నామినేటెడ్ పోస్టుల కోసం కాంగ్రెస్‌లో మళ్లీ ఆశావహులు ఎదురు చూస్తున్నారు. స్థానిక ఎన్నికలు రాబోతున్న తరుణంలో పలువురు పదవు కోసం ఎదురు చూస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌లోకి కొత్తగా వచ్చి చేరే వారిని కీలక పదువులు అప్పగించవద్దని చాలా మంది సీనియర్లు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడు చాలా మంది పార్టీ కోసం కష్టపడి పని చేశారని వారినే పరిగణలోకి తీసుకొవాలని చెప్పుకొచ్చారు. దీన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకత్వం కొత్తగా పార్టీలో చేరే వారికి మంత్రిపదవులు ఇవ్వడం లేదని తేల్చి చెప్పినట్టు సమాచారం. ఇన్ని రోజులు వివిధ కారణాలతో మూడు విషయాలపై దాటవేత ధోరణితో వచ్చిన కాంగ్రెస్‌కు ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సిన టైం వచ్చింది. మరికొన్ని రోజుల్లో లోకల్ బాడీ ఎన్నికలు జరగనున్నాయి. అందులో కాంగ్రెస్ కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలంటే వారిని ప్రోత్సహించాల్సి ఉందని అంటున్నారు నేతలు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చాలా కీలక విషయాలపై నిర్ణయాన్ని వాయిదా వేస్తూ వచ్చారు. అందులో ఒకటి మంత్రి వర్గ విస్తరణ, రెండోది పీసీసీ చీఫ్ నియామకం, మూడోది నామినేటెడ్ పోస్టుల భర్తీ. ఈ మూడు విషయాల కోసం కాంగ్రెస్ నేతలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత ఇదిగో విస్తరణ, అదిగో కొత్త పీసీసీ అంటూ రకరకాల లీకులు వచ్చాయి. కానీ అవేవీ నిజం కాదని తేలిపోయింది. అన్నింటికీ శ్రావణ మాసాన్ని ముహూర్తంగా చేసుకున్నారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం అమెరికా టూర్‌లో ఉన్న రేవంత్ రెడ్డి స్వరాష్ట్రానికి వచ్చిన తర్వాత ఢిల్లీ వెళ్తారని తెలుస్తోంది. అధినాయకత్వంతో ఈ మూడు విషయాలపై తేల్చనుందని అంటున్నారు. ఇప్పటికే ఒక దఫా నామినేటెడ్ పదువులు భర్తీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇంకా కీలకమైన విభాగాలు ఉండనే ఉన్నాయి. వాటిలో కొన్నింటినీ రెండో దఫాలో ప్రకటిస్తారని అంటున్నారు. మంత్రివర్గ విస్తరణ, తెలంగాణ పీసీసీ చీఫ్ నియామకం, నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఎప్పటి నుంచో కసరత్తు జరుగుతోంది. వివిధ దఫాలు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్, ఇతర సీనియర్ నేతలు అధినాయకత్వంతో ఈ మూడు అంశాలపై చర్చించారు. ఇంతలో బీఆర్‌ఎస్ నుంచి కీలకమైన నేతలు కాంగ్రెస్‌లో చేరడంతో వారికి ఛాన్స్ ఇస్తారేమో అని మరికొందరు కంగారు పడి అధినాయకత్వానికి విన్నపాలు చేశారు. ఇప్పుడు ఇటు పీసీసీ చీఫ్‌గా అటు సీఎంగా రెండు పదవులను నిర్వహిస్తున్న రేవంత్‌కు నేతల సమన్వయం ఇబ్బంది మారుతోందని చెబుతున్నారు. అందుకే పీసీసీ చీఫ్ నియామకం కూడా తప్పనిసరికానుంది. ఖాళీగా ఉన్న ఆరు పోర్ట్‌పోలియోలకు మాత్రం భారీగా పోటీ ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. దాదాపు 15 మంది వరకు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారట. సామాజిక కోటాలు, స్థానికత అంశాలను తెరపైకి తీసుకొచ్చి మంత్రిగా అవ్వాలని తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నారని టాక్ నడుస్తోంది. కొందరు రేవంత్ రెడ్డితో ప్రయత్నాలు చేస్తుంటే మరికొంత మంది నేరుగా అధినాయకత్వంతోనే సంప్రదింపులు జరుపుతున్నారని సమాచారం. తెలంగాణ పీసీసీ చీఫ్ పదవి మాత్రం బీసీ, లేదా ఎస్సీ, ఎస్టీ సమాజిక వర్గానికి ఇవ్వాలని ఓ అభిప్రాయానికి వచ్చినందున ఆ సామాజిక వర్గ నేతలే లాబీయింగ్ చేసుకుంటున్నారు.

# బంగ్లా హిందువులపై దాడులు

- వెంటనే స్పందించకుంటే మరింత ప్రమాదం
- కేంద్రాన్ని కోరిన జగ్గీ వాసుదేవ్



**చెన్నై :** బంగ్లాదేశ్‌లో హింసాత్మక పరిస్థితులపై ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఆధ్యాత్మిక గురువు, సద్గురు జగ్గీ వాసుదేవన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. బంగ్లాదేశ్‌లోని హిందువులను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలు బంగ్లాదేశ్ అంతర్గత విషయం కాదని పేర్కొన్నారు. మన పొరుగునున్న మైనార్టీల భద్రత కోసం సాధ్యమైనంత త్వరగా చర్యలు చేపట్టాలని కోరారు. వారికి అండగా నిలవకుంటే భారత్ ఏ నాటికి మహాభారత్ అవదని స్పష్టం చేశారు. దురదృష్టవశాత్తు ఈ దేశంలో భాగమైన ప్రాంతం.. పొరుగు ప్రాంతంగా మారిందని గుర్తు చేశారు. ఈ దురాగతాల నుంచి మనజాతికి చెందిన వారిని రక్షించడం మన బాధ్యత అని జగ్గీ వాసుదేవన్ స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లోని 27 జిల్లాలో గల హిందువుల నివాసాలు, వారి వ్యాపార సంస్థలపై దాడులు, లూటీలు చేశారని వార్తలు వస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు సంబంధించి సంస్కరణలు అమలు చేయాలని దేశవ్యాప్త ఆందోళనకు విద్యార్థులు పిలుపునిచ్చారు. దేశ ప్రజలు మద్దతు ప్రకటించారు. దీంతో దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలు, నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆ క్రమంలో వందల మంది మరణించగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ప్రభుత్వం కర్ఫ్యూ విధించింది. అయినా.. పరిస్థితులు ఏ మాత్రం అదుపులోకి రాలేదు. ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. విద్యార్థులు దేశవ్యాప్తంగా ఆందోళన బాట పట్టారు. దీంతో దేశంలో శాంతి భద్రతలు మరింత క్షీణించాయి. తప్పని సరి పరిస్థితుల్లో ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా హిందువుల దేవాలయాలు, ఇళ్లపై దాడులు జరిగాయి. ఆ క్రమంలో అందిన కాడికి దోచుకుంటున్నారు. పొరుగు దేశంలో ఇలాంటి ఘటనలు జరగడంపై సద్గురు జగ్గీవాసుదేవ్ స్పందించారు.



# బంగ్లాలో ఆగని హింసాకాండ

### వేటాడి వెంటాడి చంపుతున్న హసీనా వ్యతిరేకులు

### ఊచకోతకు గురైన 29మంది మృతదేహాల గుర్తింపు

### 20మంది అవామీ లీగ్ నేతలుగా గుర్తింపు

**ఢాకా, ఆగస్ట్ 7 :** బంగ్లాదేశ్‌లో జరిగిన హింసాకాండలో ఇప్పటికే వందల మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకా కోల్పోతున్నారు. ఆందోళన కారులు హసీనా అనుచరులను, అక్కడి హిందువులను లక్ష్యంగా చేసుకుని ఊచకోతకు దిగుతున్నారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం. ఈ విషయంలో ప్రముఖ ఆధ్యాత్మకవేల్ల జగ్గీవాసుదేవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాజీ ప్రధాని షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్ నేతలకు మృత్యుపాశమైంది. ఆ నేతలను ఆందోళనకారులు వెంటాడి, వేటాడి ఊచకోత కోశారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆ అవామీ లీగ్ నేతల మృతదేహాలు లభ్యమవుతుండటమే అందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. బంగ్లాదేశ్ వ్యాప్తంగా 29 మంది మృతదేహాలను గుర్తించారు. అందులో 20 అవామీ లీగ్ నేతలవేనని మీడియా వెల్లడించింది. సాత్ఖిరా ప్రాంతంలో 10 మంది, కొమిల్లాలో 11 మంది దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. అశోక్తలాలో ఒక మూక మాజీ కౌన్సిలర్ ఎండీ షా ఆలం ఇంటికి నిప్పు పెట్టిందని ఒక ప్రత్యక్ష సాక్షి వెల్లడించారు. దాంట్లో ఐదుగురు టీనేజర్లతో పాటు మొత్తం ఆరుగురు సజీవ దహనమయ్యారు. నటోరె ప్రాంతంలో ఒక ఎంపీ ఇంటికి నిప్పుపెట్టారు. ఆ ఇంట్లోని పలు గదులు, బాల్కనీలు, పైభాగంలో తాజాగా మృతదేహాలు లభ్యమయ్యాయి. ఆదివారం నుంచి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఆందోళనకారులు అవామీ లీగ్‌తో సంబంధాలు ఉన్నవారిపై విరుచుకుపడ్డారు. వెంటాడి మరీ వారిని ఊచకోత కోశారు. సోమవారం కూడా ఈ హింసాకాండ కొనసాగింది. షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేశారని తెలియగానే.. ఆమె మద్దతుదారులపై దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో యువ నటుడు శాంతో, దర్శకుడైన అతడి తండ్రిని అతికిరాతకంగా చంపేశారు. నిరసనకారులు వీరిని చుట్టుముట్టి కర్రలతో కొట్టి చంపినట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. ఈ నటుడు గతంలో హసీనా తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ బయోపిక్‌లో నటించడం గమనార్హం. ఢాకాలోని ప్రముఖ బంగ్లాదేశీ జానపద గాయకుడు రాహుల్ ఆనందో నివాసానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు. నిరసనకారులు దాడి చేయగానే రాహుల్ కుటుంబం అక్కడినుంచి పారిపోవడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం వారు రహస్య ప్రాంతంలో తల దాచుకున్నట్లు తెలుస్తోంది. జషోర్ జిల్లాలో అవామీలీగ్ నేతకు చెందిన హోటల్‌కు అల్లరిమూకలు నిప్పుపెట్టిన ఘటనలో 24 మంది సజీవ దహనమయ్యారు. మూడు వారాల ఆందోళనల్లో ఇప్పటివరకు ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 440కి చేరుకుంది. సోమవారం ఒక్కరోజే 109 మంది మృతి చెందారు.

ఇదిలా ఉంటే.. రాజకీయ సంక్షోభం తలెత్తిన బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వానికి మహమ్మద్ యూనస్ నేతృత్వం వహించనున్నారు. ఆయన నోబెల్ శాంతి పురస్కార గ్రహీత. ప్రధానిగా ఉన్న షేక్ హసీనా వైదొలగాల్సి రావడంతో అధ్యక్షుడు మొహమ్మద్ షహబుద్దీన్ మంగళవారం ఉదయం పార్లమెంటును రద్దు చేశారు. తొలుత తాత్కాలిక పరిపాలన యంత్రాంగం ఏర్పాటుకు, తర్వాత కొత్తగా ఎన్నికలు నిర్వహించడానికి మార్గం సుగమం చేశారు. యూనస్‌ను సారథిగా నియమిస్తున్నట్లు మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఆయన ప్రకటన వెలువరించారు.

## బంగ్లా అల్లర్లలో నటుడు సలీమ్ ఖాన్, శాంతోల దారుణహత్య

### దాడుల భయంతో పారిపోయిన జానపద గాయకుడు

**ఢాకా :** రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో నెలకొన్న అల్లకల్లోల పరిస్థితుల కారణంగా షేక్ హసీనా ప్రధాని పీఠం నుంచి దిగిపోయి, దేశాన్ని వీడాల్సి వచ్చింది. ఆమె రాజీనామా చేయగానే అవామీలీగ్ మద్దతుదారులను లక్ష్యంగా చేసుకొని అల్లరిమూకలు హింసాకాండకు పాల్పడ్డాయి. ఈ క్రమంలోనే ఓ యువ నటుడు, దర్శకుడైన అతడి తండ్రిని నిరసనకారులు అతికిరాతకంగా చంపేశారు. కాగా.. ఈ నటుడు గతంలో హసీనా తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ బయోపిక్‌లో నటించడం గమనార్హం. బంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ జీవితం, కెరీర్ తొలినాళ్లలో జరిగిన సంఘటనల ఆధారంగా బంగ్లాదేశ్‌కు చెందిన దర్శకనిర్మాత సలీమ్ ఖాన్ 2021లో ఓ సినిమాను తెరకెక్కించారు. 'తుంగిపరార్ మియా భాయ్' పేరుతో నిర్మించిన ఈ సినిమాలో సలీమ్ కుమారుడు, నటుడు శాంతో ఖాన్ హసీనా తండ్రి రెహమాన్ యుక్తవయసు పాత్రను పోషించాడు. ఈ సినిమాతో శాంతో ఖాన్ కెరీర్ మలుపుతిరిగింది. చిత్రానికి కూడా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పెరిగింది. అయితే, సోమవారం హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేశారన్న వార్త బయటకు రాగానే శాంతో, సలీమ్‌ను ఆందోళనకారులు లక్ష్యంగా చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న తండ్రీకుమారులు చాంద్‌పుర్‌లోని తమ స్వగ్రామానికి పారిపోయేందుకు ప్రయత్నించారు. మార్గమధ్యలో ఆందోళనకారులు వీరిని అడ్డుకున్నారు. ఆత్మరక్షణ కోసం వీరు కాల్పులు జరిపేందుకు ప్రయత్నించారు. కానీ, అప్పటికే నిరసనకారులు వీరిని చుట్టుముట్టి కర్రలతో కొట్టి చంపినట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. ఈ తండ్రీకొడుకులకు భారత సినీ రంగంతోనూ అనుబంధం ఉంది. పశ్చిమబెంగాల్‌లోని టాలీవుడ్‌లో సలీమ్‌ఖాన్ పలు సినిమాలను నిర్మించారు. శాంతో కూడా కొన్ని బెంగాలీ చిత్రాల్లో నటించి భారత ప్రేక్షకులకు చేరువయ్యారు. వీరి మృతి గురించి తెలియగానే పలువురు బెంగాలీ సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. సలీమ్‌ఖాన్ స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించేవారు. హసీనా, ఆమె పార్టీతో ఈయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. ఇకపోతే ఢాకాలోని ప్రముఖ బంగ్లాదేశీ జానపద గాయకుడు రాహుల్ ఆనందో నివాసానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు. నిరసనకారులు దాడి చేయగానే రాహుల్ కుటుంబం అక్కడినుంచి పారిపోవడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం వారు రహస్య ప్రాంతంలో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. సాంస్కృతిక హక్కుల కార్యకర్త అయిన రాహుల్ నివాసం అతి పురాతనమైనది. 140 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఇంటిని కల్చరల్ హబ్‌గా మార్చి అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. 2023 సెప్టెంబరులో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఢాకా పర్యటనకు వచ్చినప్పుడు ఈ నివాసాన్ని సందర్శించారు. ఈ ఇంట్లో రాహుల్ స్వయంగా డిజైన్ చేసిన దాదాపు 3వేల వాయిద్య పరికరాలు ఉన్నాయట. వాటిని ఆందోళనకారులు ధ్వంసం చేసినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

## హసీనాను బంగ్లాకు అప్పగించండి

### భారత్‌ను కోరిన బంగ్లా సుప్రీం బార్ అధ్యక్షుడు



**ఢాకా :** తప్పని పరిస్థితుల్లో బంగ్లాదేశ్ ప్రధాని పదవి నుంచి షేక్ హసీనా వైదొలిగారు. అనంతరం సోదరి షేక్ రెహానాతో కలిసి ఆమె భారత్‌కు చేరుకున్నారు. ఆ తర్వాత వీరు లండన్ వెళ్లేందుకు చేసిన ప్రయత్నాలు అయితే ఫలించలేదు. ఈ ప్రక్రియకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. అలాంటి వేళ.. బంగ్లాదేశ్‌లో సరికొత్త డిమాండ్ ప్రారంభమైంది. షేక్ హసీనాతోపాటు ఆమె సోదరిని వెంటనే అరెస్ట్ చేసి బంగ్లాదేశ్‌కు అప్పగించాలని భారత్‌ను ఆ దేశపు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు ఏఎం మహబూబ్ ఉద్దీన్ ఖోకాన్ డిమాండ్ చేశారు. ఢాకాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మహబూబ్ ఉద్దీన్ ఖోకాన్ మాట్లాడుతూ.. పొరుగనున్న భారత్‌తో సానుకూల సంబంధాలు కొనసాగించడం తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ అల్లర్లలో వందలాది మంది ప్రజలు మరణించారన్నారు. అందుకు షేక్ హసీనా పూర్తి బాధ్యత వహించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోదరితోపాటు ఆమెను అరెస్ట్ చేసి బంగ్లాదేశ్‌కు తిరిగి పంపాలని భారత్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. దేశంలో అత్యయక స్థితిని విధించవద్దంటూ బంగ్లాదేశ్ నేషలిస్ట్ పార్టీ సంయుక్త ప్రధాన కార్యదర్శి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో బంగ్లాదేశ్ నేషలిస్ట్ పార్టీ అనుకూలురుతోపాటు షేక్ హసీనా వ్యతిరేకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాజకీయ వ్యవహారాల్లో క్రియాశీలంగా వ్యవహరించిన సుప్రీంకోర్టు జడ్జిలు.. తమ పదవులకు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా షేక్ హసీనా ప్రభుత్వ హయాంలో నియమించిన వివిధ సంస్థల అధినేతలు, ఉన్నతాధికారులను కూడా రాజీనామా చేయాలనే పేర్కొన్నారు. రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేయాలని వారు ప్రభుత్వానికి సూచించారు. ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేయాలంటూ దేశవ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. దీంతో ఆగస్ట్ 5వ తేదీన తప్పని సరి పరిస్థితుల్లో ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు. దేశంలో రిజర్వేషన్లు సంస్కరించాలంటూ దేశవ్యాప్త ఆందోళనలు మొదలైనాయి. ఆ క్రమంలో షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశ్యవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. అందులో భాగంగా ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు భారీగా చేపట్టిన విషయం విధితమే. మరోవైపు బంగ్లాదేశ్‌లో ప్రభుత్వాన్ని ఆ దేశాధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్ రద్దు చేశారు. ఆ క్రమంలో మధ్యంతర ప్రభుత్వం కొలువు తీరనుంది. ఈ ప్రభుత్వాన్ని నోబెల్ శాంతి పురస్కార గ్రహీత, బ్యాంకర్ యూనస్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక జైలు నుంచి బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చైర్ పర్సన్, మాజీ ప్రధాని బేగం ఖలీదా జియా జైలు నుంచి విడుదలయ్యారు.

www.prajanaava.in
హైదరాబాద్
గురువారం, ఆగస్టు 8, 2024
ప్రజా నావ
ప్రతి అక్షరం జనం కోసం...


# వినేశ్.. నువ్వే మా ఛాంపియన్!

- నిరాశచెందొద్దు.. నీకు అండగా ఉంటాం
- ప్రకటించిన పలు రంగాల ప్రముఖులు



**పారిస్:** ఒలింపిక్స్‌లో భారత పతాకను రెపరెపలాడిస్తుందనుకున్న రెజ్లర్ వినేశ్‌ఫొగట్ పై ఆఖరి క్షణంలో అనూహ్యంగా అనర్హత వేటు పడటంతో భారతీయులు నివ్వెరపోయారు. అయితే యావత్ దేశం వినేశ్‌కు అండగా నిలచింది. నువ్వే మా ఛాంపియన్...నీ స్ఫూర్తి గొప్పది...తిరిగి విజయ శిఖరాలు అధిరోహించే శక్తి నీకుంది. నీకు మేమంతా అండగా ఉన్నాం అని ప్రధాని మోదీ మొదలుకొని ప్రతి ఒక్కరు సామాజిక మాధ్యమాలలో ప్రకటిస్తున్నారు. రాజకీయ, సినిమా, పారిశ్రామిక, క్రీడారంగాలకు చెందిన ఎందరో ఆమెకు ఓదార్పు వచనాలు పలికారు. కాగా అనర్హత వేటు పడిన వినేశ్‌ఫొగట్ అస్వస్థతకు గురయ్యారు. డీగ్రెడ్రేషన్ కారణంగా ఆమె పారిస్ లోని ఓ ఆస్పత్రిలో చేరి ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు సమాచారం. సాధారణంగా ఆటగాళ్లు రెండు రోజులు ముందు నుంచే తమ బరువును నిర్ణీత కేటగిరి పరిధిలోనే ఉంచుకోవాల్సి ఉంటుంది. అయితే మంగళవారం బౌట్ సమయంలో ఆమె తన బరువు నియంత్రణలోనే ఉంచుకొన్నట్లు తెలుస్తోంది. కానీ, మంగళవారం రాత్రికి వినేశ్ 2 కిలోల అధిక బరువు ఉంది. దీంతో జాగింగ్, సైక్లింగ్, స్కిప్పింగ్ వంటివి బరువు తగ్గేందుకు దోహదపడే ఎక్సర్‌సైజ్‌లు చేసింది. అంతేకాకుండా భోజనం కూడా తీసుకోకుండా, బరువును తగ్గించుకునేందుకు రాత్రంతా ఆమె నిద్రపోకుండా మేల్కొనే ఉన్నట్లు సమాచారం. దీని కారణంగానే వినేశ్ ఇప్పుడు డీహైడ్రేషన్‌కు గురైనట్లు క్రీడా వర్గాల మాట. ఆమెకు ఒలింపిక్ గ్రామంలోని ఓ పాలిక్లినిక్‌లో చికిత్స అందుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

### ఆనంద్ మహీంద్రా దిగ్భ్రాంతి



క్రీడాంశాలను రెగ్యులర్‌గా ఫాలో అయ్యే ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా ఎక్స్ ద్వారా తన స్పందన తెలియజేశారు. నోనోనో.. ఇది పీడకల అయితే బాగుండు. ఇది నిజం కాకపోతే బాగుండు అంటూ ట్వీట్ చేశారు. ఆనంద్ మహీంద్రా మాత్రమే కాదు.. దేశవ్యాప్తంగా ఎంతో మంది ప్రముఖులు వినేశ్‌కు మద్దతుగా నిలిచారు. ఆమె ధైర్యం కోల్పోకూడదని ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో ఆమెకు మద్దతుగా నిలవాలని అన్ని రాజకీయ పక్షాల నేతలూ వ్యాఖ్యలు చేశారు. కేవలం 100 గ్రాములు ఎక్కువ ఉందని ఆమెపై అనర్హత వేటు వేయడం దారుణమని ఆప్ ఎంపీ అన్నారు.

### సవాల్ చేసేందుకు ఐఓఏ సిద్ధం

అయితే వినేశ్ ఫొగాట్ విషయంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఐఓఏ వారిపై సవాల్ చేసేందుకు సిద్ధమైంది. ఒలింపిక్ అసోసియేషన్ నిబంధనల మేరకు, పోటీ జరిగే రోజున బరువుతోపాటు వైద్య పరీక్షలు నిర్వహించడం కామనే. అయితే, మంగళవారం రాత్రి సెమీస్ పోరులో తలపడినప్పుడు లేని ఫొగాట్ బరువు బుధవారం ఉదయానికల్లా పెరగడంపైనా కూడా ఐవోఏ అనుమానాలను వ్యక్తం చేస్తోంది. ఒకవేళ నిర్ణయంపై ఒలింపిక్ కమిటీ పునఃసమీక్ష లేకుంటే మాత్రం ఫొగాట్‌పై అనర్హత వేటు కొనసాగుతుంది. అప్పుడు అమె స్వదేశానికి తిరిగిరాకతప్పదని క్రీడా వర్గాల మాట. "రెజ్లింగ్ 50 కేజీల విభాగం నుంచి వినేశ్ ఫొగాట్ అనర్హత వేటును ఎదుర్కోవాల్సి వచ్చింది. కేవలం కొన్ని గ్రాముల బరువు పెరగడం వల్ల ఆమెపై ఈ వేటు పడింది. దయచేసి వినేశ్ ప్రైవసీకి భంగం కలగించకుండా ప్రవర్తించాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ వార్తను పంచుకోవడం అత్యంత బాధాకరంగా ఉంది" అంటూ భారత ఒలింపిక్ సంఘం తాజాగా ఓ ప్రకటనలో పేర్కొంది.

### '100గ్రాములు బరువు ఎక్కువున్నా అనుమతిస్తారు కదా?'

పసిడి పోరుకు అర్హత సాధించిన వినేశ్ ఫొగాట్‌పై అనూహ్యంగా అనర్హత వేటు పడటం అందర్నీ షాక్‌కు గురి చేస్తోంది. వంద గ్రాముల అధిక బరువు ఉండడం వల్ల ఒలింపిక్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుందని చెప్పడం విమర్శలకు దారీ తీసింది. ఈ క్రమంలోనే వినేశ్ ఫోగాట్ పెద్ద నాన్న మహావీర్ స్పందించారు. 'గోల్డ్ మెడల్ కోసం దేశమంతా ఎంతో ఎదురు చూసింది. సాధారణంగా రెజ్లర్ ఓ 50-100 గ్రాముల బరువు ఎక్కువగా ఉన్నప్పటికీ ఆడటానికి అనుమతిస్తారు. అయితే, అక్కడ రూల్స్ మాత్రం మరోలా ఉండటం వల్ల అనర్హత వేటు పడింది. దేశ ప్రజలెవరూ నిరాశ చెందొద్దు. ఆమె ఏదో ఒక రోజు కచ్చితంగా దేశం కోసం మెడల్‌ను తెచ్చి పెడుతుంది. ఆమెను నెక్ట్స్ ఒలింపిక్స్ కోసం సన్నద్ధం చేస్తాను' అని అన్నారు. ఇక ఆమె అనర్హత వేటుపై ఇప్పటికే ప్రధాని మోదీ సహా పలువురు క్రీడా ప్రముఖులు స్పందించారు. ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు.

### 'ఫొగాట్ అనర్హత క్రూరమైన చర్య - అథ్లెట్లకు ఆ మాత్రం తెలుసు

ఒలింపిక్స్‌లో అనర్హత వేటు పడిన భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు పలువురు అండగా నిలుస్తున్నారు. ఇదే విషయంపై భారత బాక్సర్ విజేందర్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. దీన్ని విధ్వంసకర చర్యగా అభివర్ణించాడు. వినేశ్ వంటి ఎలైట్ అథ్లెట్లకు ప్రధాన పోటీలకు ముందు బరువు ఎలా తగ్గాలో తెలుసని పేర్కొన్నాడు. 'ఒకవేళ అథ్లెట్ కాస్త అధిక బరువు ఉంటే స్టీమ్ బాత్, రన్నింగ్, డైట్ వల్ల దానిని తగ్గించవచ్చు. కానీ, ఫైనల్‌కు ముందు కేవలం 100 గ్రాముల బరువు ఉన్నట్లు చెబుతూ అనర్హత వేటు వేయడం సరైన చర్య కాదు. బరువు తగ్గించుకోవడానికి బాక్సర్లకు సమయం ఇస్తారు. అథ్లెట్లు రాత్రిపూట 5- 6 కిలోల బరువు తగ్గించగలరు. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ఆకలి, దాహాన్ని ఎలా నియంత్రించాలో అథ్లెట్లకు బాగా తెలుసు' అని విజేందర్ వ్యాఖ్యానించాడు.

### గోల్డ్ మెడల్ ఎవరికంటే?

ఈ పోటీల్లో వినేశ్‌పై అనర్హత వేటు పడినందున ఆమెకు ఎటువంటి పతకం ఇవ్వరని సమాచారం. అయితే ఆమెతో పాటు ఫైనల్‌లో ఉన్న అమెరికా క్రీడాకారిణి సారా హిల్డెబ్రాండ్‌కు మాత్రం ఆఖరి పోరులో పాల్గొనకుండానే బంగారు పతకాన్ని అందజేస్తారు. సిల్వర్ మెడల్‌ను మాత్రం ఎవరికీ కేటాయించకుండా అలాగే వదిలేస్తారు. ఇక కాంస్య పతక పోటీలు లాంఛనంగా జరుగుతాయని అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం ప్రకటించింది.




### క్వార్టర్ ఫైనల్లో అదరగొట్టిన వినేశ్

50 కిలోల విభాగంలో తొలి రౌండ్‌లో ఫోగట్ ప్రత్యర్థి జపాన్ టాప్ రెజ్లర్ సుసాకి అని డ్రా ఖరారు కావడంతో అందరూ ఆశలు వదిలేసుకొన్నారు. ఎందుకంటే అంతర్జాతీయ కెరీర్‌లో ఆడిన 82 మ్యాచ్‌లో సుసాకి ఒక్క బౌట్ కూడా ఓడలేదు. పైగా టోక్యోలో గోల్డ్‌తోపాటు నాలుగుసార్లు వరల్డ్ ఛాంపియన్ కావడంతో ఫోగట్ పని ఇక అంతే అని పెదవి విరిచారు. బలమైన ప్రత్యర్థిని వ్యూహాత్మకంగా ఎలా దెబ్బకొట్టాలో ముందుగానే సిద్ధమైన వినేశ్.. మ్యాట్‌పై దాన్ని ఆచరణలో పెట్టి అద్భుతం చేసింది. మంగళవారం జరిగిన రౌండ్- 16లో ఫొగట్ 3-2 సుసాకిపై చిరస్మరణీయ విజయంతో క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. బౌట్‌లో 90 సెకన్లు ఇద్దరు రెజ్లర్లు ఒకరిని ఒకరు అంచనా వేసుకోవడానికే కేటాయించారు. వినేష్ రక్షణాత్మకంగా వ్యహరించడంతో తొలి పాయింట్ కోల్పోయింది. ఆ తర్వాత ఫోగట్, సుసాకి అదను కోసం వేచి చూసే ధోరణినే అవలంబించారు. మరో పాయింట్ కోల్పోయిన ఫోగట్ 0-2తో వెనుకబడింది. పటిష్టమైన డిఫెన్స్‌తో సుసాకి పాయింట్లు ఇవ్వకుండా ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించింది. పోటీ ముగియడానికి మరో 15 సెకన్ల సమయం ఉందనగా.. అప్పటి వరకు దూరదూరంగా ఉంటూ ప్రత్యర్థిని మభ్యపెట్టిన వినేశ్.. ఒక్కసారిగా సుసాకిపై ఎదురుదాడి చేసింది. పట్టు కోల్పోయిన జపాన్ రెజ్లర్‌ను మ్యాట్‌పై పడేసి రెండు పాయింట్లు స్కోరు చేసింది. హఠాత్ పరిణామంతో సుసాకి నివ్వెరపోయి చూస్తుండగా.. ఫొగట్ సంబరాల్లో మునిగింది. జపాన్ రెజ్లర్ చాలెంజ్ చేసినా.. ఆమెకు నిరాశే ఎదురైంది. ఇక, క్వార్టర్స్‌లో ఓక్సానాపై వినేశ్ 7-5తో గెలిచింది. తొలుత ఫొగట్ 4-0తో ఆధిక్యం సాధించింది. కానీ, పోరాడిన ఓక్సానా.. వినేశ్‌ను తన పట్టులో బిగిస్తూ 4 పాయింట్లు స్కోరు చేసింది. చివరి 48 సెకన్లలో ఓక్సానాను టేక్‌డౌన్ చేసిన ఫొగట్ బౌట్‌ను ముగించింది.

### సెమీ ఫైనల్లో కూడా..

వరుసగా రెండు బౌట్‌లు నెగ్గి ఆత్మవిశ్వాసంతో ఉన్న ఫొగట్.. సెమీ-స్‌లోనూ అదే జోరు చూపింది. ఏకపక్షంగా సాగిన పోరులో వినేష్ 5-0తో యుస్నేలిస్ గుజ్‌మన్ లోపెజ్ (క్యూబా)ను చిత్తు చేసింది. ఇద్దరు ఆరంభంలో ఆచితూచి ఆడారు. లోపెజ్ రక్షణాత్మకంగా వ్యవహరించడంతో.. ఫొగట్‌కు తొలి టెక్నికల్ పాయింట్ లభించింది. తర్వాత మరింత దూకుడుగా వ్యవహరించిన వినేష్ 4 పాయింట్లతో బౌట్‌ను సొంతం చేసుకొంది. రియో, టోక్యో క్రీడల్లో క్వార్టర్స్‌లోనే వెనుదిరిగిన ఫొగట్ ఈసారి ఏకంగా ఫైనల్‌కు చేరుకుంది. ఈ రోజు రాత్రి ఫైనల్ జరగాల్సి ఉంది. గోల్డ్ మెడల్ కొడుతుందని క్రీడాభిమానులు ఆశగా ఎదురుచూశారు. కానీ కాస్త బరువు పెరిగిందని అనర్హత వేటు వేసి, భారత ఆశలపై ఒలింపిక్ నిర్వాహకులు నీళ్లు చల్లారు.

### 'వినేశ్‌కు అండగా ఉన్నాం
#### కేంద్ర క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవీయ



వినేశ్ ఫొగాట్‌కు కోచ్, సహాయ సిబ్బందిని నియమించామని కేంద్ర క్రీడా మంత్రి మన్ సుఖ్ మాండవీయ లోక్ సభలో వెల్లడించారు. ఆమెకు ఫిజియోథెరపిస్ట్ కూడా ఉన్నారని గుర్తు చేశారు. వినేశ్ గతంలో అనేక విజయాలు సాధించిందని కొనియాడారు. వినేశ్ ఫొగాట్‌కు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలిచిందని, ఆమెకు అత్యుత్తమ శిక్షణ తీసుకునేలా సాయపడ్డామని వివరించారు. ఫొగాట్ అనర్హతపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉషను ఆదేశించారని పేర్కొన్నారు. ఫొగాట్ పై అనర్హత వేటుపై జీరో అవర్‌లో ప్రభుత్వం ప్రకటన చేయాలని విపక్షాలు పార్లమెంట్‌లో డిమాండ్ చేశాయి. ఈ విషయంపై క్రీడా మంత్రి సమాధానం చెప్పాలని నినాదాలు చేశాయి. ఈ మేరకు మన్‌సుఖ్ మాండవీయ వినేశ్ ఫొగాట్ అనర్హత అంశంపై ప్రకటన చేశారు.



### వినేశ్ ఇంటికి వెళ్లిన పంజాబ్ సీఎం

అనర్హత వేటు పడిన రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఇంటికి పంజాబ్ సీఎం భగవంత్ మాన్ వెళ్లారు. ఫొగాట్ కుటుంబ సభ్యులను హరియణాలో కలిశారు. ఈ మేరకు వారితో మాట్లాడారు.

# ఇహ్సానుల్లా జనత్‌పై ఐదేళ్ల నిషేధం

### అవినీతి కార్యకలాపాలకు పాల్పడినట్లు అంగీకరించిన టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్

**కాబూల్:** అఫ్ఘానిస్థాన్ టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ ఇహ్సానుల్లా జనత్‌పై క్రికెట్ నిషేధం విధించారు. అతడిపై 5 ఏళ్ల పాటు నిషేధం విధించారు. అవినీతి కార్యకలాపాలకు సంబంధించి ఆయనపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది కాబూల్ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొన్నప్పుడు అవినీతికి పాల్పిడినట్లు తెలిసింది. అఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు ఒక ప్రకటనలో, "ఐసీసీ అవినీతి నిరోధక కోడ్‌లోని ఆర్టికల్ 2.1.1ని ఉల్లంఘించినందుకు జనత్ దోషిగా తేలాడు". ఈ ఉల్లంఘన దృష్ట్యా, అతను అన్ని క్రికెట్ సంబంధిత కార్యకలాపాల నుంచి ఐదేళ్లపాటు నిషేధించబడ్డాడు. జనత్ ఆరోపణలను అంగీకరించాడు. అవినీతి కార్యకలాపాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. మరో ముగ్గురు ఆటగాళ్ల ప్రమేయంపై బోర్డు దర్యాప్తు చేస్తోందని ఏసీబీ పత్రికా ప్రకటన ధృవీకరించింది. ప్రస్తుతం విచారణలో ఉన్న మ్యాచ్ ఫిక్సింగ్‌లో మరో ముగ్గురు ఆటగాళ్లు కూడా పాల్గొనవచ్చని ఏసీబీ అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) వెల్లడించింది. ఇటువంటి పరిస్థితిలో వారిపై వచ్చిన ఆరోపణలు నిజమని రుజువైతే.. వారిపై కూడా చర్యలు తీసుకుంటాం అని అఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. 26 ఏళ్ల ఆటగాడు కాబూల్ ప్రీమియర్ లీగ్‌లో శంషాబాద్ ఈగల్స్ తరపున ఆడాడు. ఇటువంటి పరిస్థితిలో, అతను ఈ సంవత్సరం లీగ్‌లో ఆడిన 4 మ్యాచ్‌లలో మొత్తం 72 పరుగులు చేశాడు. కాగా, జనత్ మొత్తం 3 టెస్టులు, 16 వన్డేలు, ఒక టీ20 ఆడాడు. జనత్ అఫ్ఘనిస్థాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ నవ్రోజ్ మంగళ్ సోదరుడు. అతను జింబాబ్వేతో తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. అఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టు అద్భుతమైన ఆటను కనబరిచింది. కానీ జట్టు తరచుగా ఆఫ్ ఫీల్డ్ వివాదాల్లో కనిపిస్తుంది. ఇహ్సానుల్లా తన చివరి వన్డేను 2018లో బంగ్లాదేశ్‌తో ఆడాడు. 2019లో వెస్టిండీస్‌తో తన చివరి టెస్టు ఆడాడు. ఇది కాకుండా, అతను మొదట 2017 సంవత్సరంలో అఫ్ఘనిస్తాన్ జట్టులో చోటు సంపాదించాడు.




# టీమిండియాకు షాక్

- చివరి వన్డేలోనూ ఓడిన భారత్
- 0-2 తేడాతో సిరీస్ శ్రీలంక కైవసం

**కొలంబో:** టీ 20 ప్రపంచకప్ గెలిచి ఫుల్ జోష్ లో ఉన్న టీమిండియాకు శ్రీలంక షాక్ ఇచ్చింది. మూడు వన్డేల సిరీస్ లో 0-2 తేడాతో భారత జట్టును ఓడించి సిరీస్ ను కైవసం చేసుకుంది. బుధవారం కొలంబో ప్రేమదాస స్టేడియం వేదికగా భారత్-శ్రీలంక మధ్య జరిగిన చివరిదైన మూడో వన్డేలో ఆతిథ్య జట్టు ఏకంగా 110 పరుగుల తేడాతో విజయం సాధించింది. సిరీస్ ఆరంభానికి ముందు ఫేవరెట్ గా బరిలోకి దిగిన రోహిత్ జట్టు మూడు వన్డేల్లో కనీసం ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. సిరీస్ లో వరుస పరాజయాలను మూట గట్టుకుంది. ఫేవరెట్ గా బరిలోకి దిగిన రోహిత్ జట్టు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేక ఘోర పరాజయాన్ని చవిచూసింది. విచిత్రం ఏమిటంటే.. ఈ సిరీస్‌లో 8వ ఆర్డర్ వరకు బ్యాటర్లు ఉన్న టీమ్‌ఇండియా మూడు మ్యాచ్‌ల్లోనూ 250 కంటే తక్కువ లక్ష్యాన్ని ఛేదించలేక చతికిల పడింది. దీంతో 1997 తర్వాత అంటే సరిగ్గా 27 ఏళ్ల తర్వాత శ్రీలంకలో వన్డే సిరీస్‌ను కోల్పోయి టీమిండియా పేలవమైన రికార్డును లిఖించింది. అలాగే, ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియా బ్యాటింగ్ వైఫల్యం జట్టు కొత్త కోచ్ గౌతం గంభీర్‌ను ఆందోళనకు గురి చేసింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 248 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీనికి సమాధానంగా టీమిండియా 138 పరుగులకే ఆలౌటైంది. ఆశ్చర్యకరంగా స్టార్ బ్యాటర్లతో కూడిన భారత జట్టు పూర్తి 50 ఓవర్లు ఆడలేక కేవలం 26.1 ఓవర్లలోనే తన ఇన్నింగ్స్‌ను ముగించింది. ఈ మ్యాచ్ కోసం టీమిండియా 9 మంది బ్యాటర్లను రంగంలోకి దించింది. అయితే శ్రీలంక స్పిన్‌కు అనుకూలమైన పిచ్‌పై రోహిత్ శర్మ మినహా మరే బ్యాటర్ సత్తా చాటలేకపోయారు. శ్రేయాస్ అయ్యర్ 8 పరుగులు, అక్షర్ పటేల్ 2 పరుగుల వద్ద, ర్యాన్ పరాగ్ 15 పరుగులకే పెవిలియన్ బాట పట్టారు. శివమ్ దూబే కేవలం 9 పరుగులకే ఔట్ కాగా, చివర్లో వాషింగ్టన్ సుందర్ 30 పరుగులతో ఒంటరి పోరాటం చేశాడు. అంతకు ముందు శుభ్‌మన్ గిల్ తో పాటు విరాట్ కోహ్లి కూడా త్వరగానే ఔటయ్యారు.




### దునిత్‌కు మళ్లీ ఐదు వికెట్లు

భారత జట్టు ఓటమికి ప్రధాన కారణం శ్రీలంక స్పిన్నర్ల దాడి. ముఖ్యంగా భారత బ్యాట్స్‌మెన్‌లకు ధీటుగా నిలిచిన లెఫ్టార్మ్ స్పిన్నర్ దునిత్ వెల్లాల కేవలం 31 బంతుల్లోనే 5 వికెట్లు పడగొట్టి సిరీస్‌లో రెండోసారి ఐదు వికెట్లు తీసిన ఘనత సాధించాడు. అతడితో పాటు లెగ్ స్పిన్నర్ జెఫ్రీ వాండర్సే 2 వికెట్లు తీయగా, మహేశ్ థీక్షన్, అసిత ఫెర్నాండో ఒక్కో వికెట్ తీశారు. రోహిత్ శర్మ మినహా టీమిండియా బ్యాటర్ ఎవరూ వన్డే సిరీస్‌లో చెప్పుకోదగ్గ స్థాయిలో రాణించలేకపోయారు. రోహిత్ మొత్తం సిరీస్‌లో 157 పరుగులు చేసి భారత్ తరఫున సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు.

మిగిలిన ఆటగాళ్లలో అక్షర్ పటేల్ 79 పరుగులు, విరాట్ కోహ్లీ 58 పరుగులు మాత్రమే, ఓపెనర్ శుభ్‌మన్ గిల్ 57 పరుగులు, సుందర్ 50 పరుగులు చేశారు. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం దక్కించుకున్న కేఎల్ రాహుల్ 31 పరుగులు, అయ్యర్ 38 పరుగులు మాత్రమే చేశారు.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657